
# సంఘర్షణ

కావిలిపాటి విజయలక్ష్మి



"నన్ను మరచిపోయావా బావా?" అడిగిందామె తన దగ్గరలో నిల్చుని అదే చిరునవ్వుతో.


"నువ్వు? ...నువ్వు!..." అని ప్రశ్నించిన మూర్తి కనుబొమలు ముడిపడ్డాయ్.


"రాధని..." అని గలగలా నవ్విందామె.

అతని గుండె గుభిల్లుమంది. అదే నవ్వు. అదే కొంటెతనం.

ఒకప్పుడు తనను నవ్వించి, కవ్వించి, ఏడిపించిన రాధ. అప్పటి అమ్మాయి రాధ. ఇప్పుడు యువతిగా, సన్నని పమిటచాటున తళతళా మెరిసే మంగళసూత్రాలతో గృహిణిగా తనముందు నిల్చుంది. ఎందుకు వచ్చినట్టు?

మౌనంగా నిల్చుండిపోయిన అతనివైపు బాధగాచూస్తూ "ఏం కంగారుగా ఉందా బావా? నేను రావడం నీకు ఇబ్బందిగా ఉందా?" అడిగింది.




"అహ, కాదు. కాదు, ఎందుకు వచ్చావని ?"

"ఎందుకా?" అని నవ్వి, "అక్కయ్య సంగతి...ఏంచేద్దామని అడగాలని వచ్చాను" అంది రాధ.

"ఇప్పుడేమిటాలోచన? డబ్బు... ఈమధ్య పంపలేకపోతున్నాను. అదా ! సరె. వచ్చేనెల నుంచీ ప్రయత్నిస్తాను. పంపిస్తాలే."

"అదికాదు బావా ?"

"మరి ?"

"అక్కయ్య. ఎక్కడఉంటుందీ అన్న సమస్య. నాన్నగారెప్పుడోపోయారు. అది నీకు తెలిసేఉంటుంది. ఇప్పుడు అన్నయ్య కూడా పోయాడు."

"అయితే !"...అతను కనుబొమలు చిట్లించి ఆమెవైపు చూశాడు.

"అన్నయ్య పోయి అప్పుడే ఆరునెలలైంది. వదిన ఇప్పుడు తన ఇద్దరి పిల్లలతో పుట్టింటి కెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది."

"అవన్నీ నాదగ్గరరెందుకు ? మీతో సంబంధాలు నాకెప్పుడో తెగిపోయాయ్."

"హు. తెంపేసుకున్నానను, బాగుంటుంది."

"నిర్మల చూస్తే అనవసరమైన గొడవ. వెళ్ళిపో రాధా!"

"వెళ్ళిపోతాను. వెళ్ళిపోక నీ ఇంట్లో ఉండాలని వచ్చానా! కాని, కాస్త న్యాయంగా ఆలోచించు బావా ?"

"ఏమిటాలోచించాలి న్యాయంగా ! నన్నేం చెయ్యమంటావిప్పుడు ?" చిరాగ్గా అన్నాడతను.

"అక్కయ్యకు నీ ఇంట్లో తలదాచుకోవడానికి స్థానం ఇయ్యి."

"వీలవదు."

రోషంతో రాధ వదనం కందిపోయింది. "వీలవదు. ఎలా వీలవుతుందీ ! నువ్వెంత స్వార్థపరుడివి ? ఒక్కసారి వెనుదిరిగి గతంలోకి చూడు. నీ ఈ ఉద్యోగం, హోదా, ఇప్పటి నీ భార్యా ఇవ్వన్నీ నీకెలావచ్చాయో ! మనసున్న మనిషిగా, ఒక్కసారి ఆలోచించు. కనీసం వంటమనిషిగా నన్నా అక్కయ్యకి నీ ఇంట్లో స్థానం ఇయ్యి."

"ఆ స్థానం నువ్వే ఇవ్వచ్చు..."

"నాతో తీసుకుపోయేదాన్నే కాని మాది ఉమ్మడి కుటుంబం."

"వంటచేసి బ్రతికేలాఉంటే నా ఇల్లేనా ఉన్నది ? మరో ఇల్లు చూపించు."

"ఛి. ఛీ. నోర్ముయ్."

"గెటవుట్." గేటువైపు చెయ్యిచూపించాడు మూర్తి.

"ఎంత పొరకప్పిఉన్నావు నువ్వు! నీకూ అక్కయ్యకూ తెగతెంపులు కాలేదు గుర్తుందా ?. నేను...నేను లాయరు భార్యను. నువ్వు ఎలా ఆమెను పోషించవో నీ ఇంట్లో ఎందుకు స్థానంఇవ్వవో చూస్తాను." అని క్షణంతర్వాత బాధగా నిట్టూర్చి, "అక్కయ్య నీ సుఖంకోసం ఎంత త్యాగం చేసిందో ఆలోచించు. ఆమెను ఉసురుపెట్టడం అల్లరిపడటం నీకు న్యాయంకాదు. నీ ఇంట్లో ఆమె గుట్టుగా ఉంటుంది. నీ మొదటి భార్యగా నీ భార్యకు తెలియనివ్వదు. ఇదిగో నా అడ్రను. ఆలోచించి ఉత్తరం వ్రాయి." అంటూ తమ అడ్రసున్నకాయితం అతనివైపు విసిరి గిరిక్కున వెనుదిరిగింది రాధ.


వెనుదిరిగి వెళ్ళిపోతూన్న రాధవైపుచూసి నిరసనగా నవ్వాడు మూర్తి

"చదివిన మనిషికన్నా కుక్క నయం అనిపించకు మూర్తి" అని తానూ అలానే నవ్వింది రాధ.

ఎందుకలా నవ్వింది? ఏమిటాగతం ?

* * *

"ఇదిగో మామయ్యా ప్యానయ్యాను" అన్నాడు మూర్తి, ధరంధామయ్యచేతికి మార్కులలిస్టు యిస్తూ. కళ్ళజోడు




సవరించుకొని, అతని మార్కులలిస్టు చూస్తూ. "ఓరి బడవా! బాగావచ్చాయే మార్కులు!" అంటూ నవ్వి, "మీ బామ్మ ఏమన్నారు?" అడిగాడు పరంధామయ్య.

"బామ్మకి చెప్పలే ఇంకా. ఉద్యోగమేదన్నా చూడు మామయ్యా!" అన్నాడు మూర్తి.

"నీ కెవరిస్తారోయ్ ఉద్యోగం. పదహారు నిండాయి అంతే కదూ!" అంటూ మూర్తివైపు పరిశీలనగా చూశాడు పరంధామయ్య ఏదో ఆశతో.

తలవాల్చేడు మూర్తి మౌనంగా. అతని వదనం చిన్నబోయింది.

తల్లీతండ్రి లేని మూర్తి బామ్మ సంరక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. రెండు గదుల పెంకుటిల్లూ ,రెండెకరాల పొలం వారి ఆస్తి. ఓ గదిలో తాముంటూ ఓ గది అద్దెకిచ్చింది మూర్తి బామ్మ అన్నపూర్ణమ్మ. భూమి సాగు చేయించి వచ్చే ధాన్యం, ఇంటద్దెతో గుట్టుగా కాలక్షేపంచేసేవారు. మూర్తి తండ్రీ, పరంధామయ్య స్నేహితులు కావడాన, వీరి మంచిచెడ్డలు చూసి ఆదుకునేవాడు పరంధామయ్య.

"బామ్మగార్ని ఓసారి రమ్మను మాట్లాడతాను. మూర్తీ నీకు ఇంకా చదవాలనుందా?" అడిగాడు పరంధామయ్య.

"డబ్బు కావాలి కద, చదవాలనుంటే మాత్రం ఎలా?"

"పోనీ డబ్బుపెట్టేవారెవరన్నా ఉంటే చదువుకుంటావా?"

నవ్వాడు మూర్తి. "నన్నెవరు చదివిస్తారు మామయ్యా!" అంటూ.

"నేను!" అన్నాడు పరంధామయ్య.

"వద్దులే మామయ్యా, ఏదన్నా ఉద్యోగం చూసిపెట్టు."

"నీ మొహం నీకేంతెలుసుకాని బామ్మగారిని పంపిద్దూ."

గబగబా ఇంటికి వెళ్ళిన మూర్తి, "బామ్మా, మామయ్యెందుకో నిన్ను రమ్మన్నాడు. ఇదిగో నా మార్కులలిస్టు వచ్చేసింది. ప్యాసయ్యేను." అన్నాడు.

"మామయ్యను ఉద్యోగంసంగతి అడిగావా!" ప్రశ్నించిందామె. మూర్తి స్కూలుఫైనలు చదువుతూన్న దగ్గర నుంచీ తనకు తెలిసిన ప్రతివారికీ, 'మామనవడు స్కూలు ఫైనలు చదువుతున్నాడు. ఏదన్నా ఉద్యోగం చూసిపెట్టండి బాబూ!' అని చెబుతూంది అన్నపూర్ణమ్మ.

'చెప్పాను, నిన్నోసారి రమ్మన్నాడు. వెళ్ళిరద్దూ!" అన్నాడు మూర్తి విసుగ్గా. పరంధామయ్య నేను చదివిస్తాను అన్నదగ్గరనుంచీ అతని హృదయంలో అలజడి రేగింది.

వారింటికి వెళ్ళివచ్చిన అన్నపూర్ణమ్మ సంతోషంగా నవ్వుకొంటూ, "రా బాబూ. చాలా రాత్రయింది. భోజనం చెయ్యి" అంటూ మనవణ్ణి పిలిచింది.

అతనికి ఆప్యాయతగా వడ్డిస్తూ "బాబూ, సత్యవతిని నీకు ఇస్తానంటున్నాడు మామయ్య. నీకు ఇష్టమే కదూ. పదహారోవన్నె బంగారంలా ఉంటుంది సత్యవతి." ఆగి మనవడి మొహంలోకి చూసింది అన్నపూర్ణమ్మ.


"బాగుంది. చదువూ కాదు ఉద్యోగమూకాదు. సమ్మందం కుదుర్చుకు వచ్చావా!" అంటూ నవ్వి, "నాకిప్పుడు పెళ్ళేమిటి బామ్మా" అన్నాడు మూర్తి.


"ఇప్పుడే కాదులే. ఒహ ఒప్పందం."

"ఏమిటది?" అతని లేతహృదయం తీవ్రంగా కంపిస్తూంటే అడిగాడు మూర్తి.

"సత్యవతికి ఇప్పుడు పదమూడో ఏడట. అది స్కూలు ఫైనలు ప్యాసయ్యాక పెళ్ళిచేద్దాంలే అన్నాను. అలా కాదు మూర్తికి మైనార్టీ తీరగానే చేసేద్దాం అన్నాడు మామయ్య. నీకు ఇంజనీరింగు చదువు తన డబ్బుతో చెప్పిస్తాడట."

'నీకు ఇంజనీరింగు చదువు తన డబ్బుతో చెప్పిస్తాడట' సంతోషంతో వివశుడైపోయాడు మూర్తి.




ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనంగా దొర్లాయి.

అతనేమిటి చెబుతాడో అని ఆత్రుత అన్నపూర్ణమ్మది.

సత్యవతి మెతక. ఆమెను తన భార్యగా చేసుకోవడమా, అని ఆలోచన మూర్తిది. సత్యవతి పచ్చగా అందంగా ఉంటుంది కాని నెమ్మదిగా మందకొడిగా ఉన్నట్టు కనిపిస్తుంది. తనకన్నా చిన్నదైన రాధ చెలాకీగా చురుగ్గా ఉంటుంది. చదువు, సత్యవతీ సెకెన్ ఫారమే. రాధా సెకెన్డ్ ఫారమే. ఇలా ఆలోచిస్తున్న మూర్తి, 'సత్యవతి బాగుంటుంది కదురా! నెమ్మదైన పిల్ల' అన్న అన్నపూర్ణమ్మ మాటకు సిగ్గుపడి, "నీ ఇష్టం బామ్మా!" అనేశాడు.

పొంగిపోయింది అన్నపూర్ణమ్మ. పరంధామయ్య ఇంటికి తరుచు కూరలవీ వండి పంపిస్తూంది. పరంధామయ్య ఆ ఊరి కరణమేకాక బాగా స్థితిమంతుడు. అతని భార్య ఈ మధ్యనే మరణించింది. రామం, సత్యవతీ, రాధ అతని సంతానం. భార్య పోయిన తర్వాత ఇంట్లో వంటమనిషిని ఏర్పాటుచేసుకొని పిల్లల్ని ప్రాణంగా పెంచుతున్నాడు. మూర్తి రూపం తెలివీ అతనికి వచ్చాయి. పైకి చదివిస్తే రాణించే కుర్రాడని అభిప్రాయపడ్డాడు. తన అల్లుణ్ణి చేసుకొని చదివించాలనే నిశ్చయాని కొచ్చాడు. తన కొడుకు రామానికి చదువు అబ్బడంలేదు. అల్లుడైనా పెద్ద ఉద్యోగస్థుడవాలని అతని ఆకాంక్ష.

ఆ రోజు వారింటికి వచ్చిన మూర్తిని చూసి సిగ్గుపడింది సత్యవతి. అంతకు తొలిరోజు రాత్రి కూతుర్ని బుజ్జగించి 'రామ్మూర్తికి ఇంజనీరింగు చెప్పిస్తాను. అతనంటే నీకు ఇష్టమేనా? పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగాడు. నాకు ఇష్టమే అనేసింది సత్యవతి.

"పట్నంలో కాలేజీసీటుకు అప్లైచెద్దాం. రేపు వెళ్దాం. నీకు మంచి బట్టలున్నాయా?" అడిగాడు పరంధామయ్య.

బామ్మ కుట్టించిన బిన్నీ పాప్లెన్ బట్టలే వేసుకుంటూంటాడు మూర్తి. అయినా అయిదారు జతలున్నాయి. ఉన్నాయి మామయ్యా అనేశాడు. కాని మర్నాడు తనతో బయలుదేరిన మూర్తిబట్టలవైపు చూసిన పరంధామయ్య, "ఏరా బాబూ ఇంతకన్నా మంచి బట్టలు లేవా? మీ బామ్మ కుట్టించదులే, అది నాకు తెలుసు. పోన్లే తిరిగివచ్చాక కుట్టిస్తాను," అన్నాడు నవ్వేస్తూ.

మూర్తి మొహమాటపడుతున్నా, పట్నంలోనే నాలుగు జతలు ఖరీదైన పాంట్లూ షర్టులూ తీసి, టైలరుకిచ్చాడు పరంధామయ్య. అతను ఉండటానికి రూమ్ తీశాడు.


తన స్వంత కొడుకు గురించిలా హడావుడిపడిపోతున్న పరంధామయ్య వైపు కృతజ్ఞతగా చూశాడు మూర్తి.

* * *

మూర్తి పి.యు.సి. లో జాయినయ్యాడు. అతనెప్పుడు బామ్మను చూడాలని వచ్చినా, తన ఇంటికి భోజనానికి తీసుకుపోయేవాడు పరంధామయ్య. సత్యవతి, రాధ, రామం వీళ్ళంతా అతనితో చిన్నప్పటినుంచీ ఆడుకొన్నవారే. రాధ, రామం తప్ప అతనితో సత్యవతి మాట్లాడటం మానేసింది. పెళ్ళీ కాలేదు, భార్యా అవలేదు. చిన్నవాళ్ళం. అసహ్యంగా సిగ్గుపడుతుందేమిటి నా దగ్గర ! అని చిరాగ్గా ఉండేది మూర్తికి, వారింటికి వెళ్ళాలంటే. కాని పరంధామయ్య బలవంతంవల్ల రానని చెప్పలేకపోయేవాడు.

పండగ సెలవులకి ఇంటికి వెళ్ళకూడ దనుకున్నాడు మూర్తి. ఒకటి రెండు రోజులు సెలవులిచ్చేశారు. మూర్తి ఇంకా రాలేదని ఎదురుచూసిన పరంధామయ్య. పట్నం ప్రయాణం కట్టేశాడు. అతనికి కాబోయే అల్లుడు చెడు స్నేహాలు చేసి చెడిపోతాడేమో అనే భయంకూడా ఉంది.

పరంధామయ్యను చూసిన మూర్తి "పరీక్షలు దగ్గరవుతున్నాయి. ఇక్కడే ఉండిపోదామని ఉంది మామయ్యా" అన్నాడు.




"అక్కడే చదవచ్చులేవోయ్. మేడమీద చిన్నగది నీ ఒక్కడికే కేటాయించాను. పండగపూట ఇక్కడ ఉండిపోతావా? రా పోదాం," అన్నాడు పరంధామయ్య?

మౌనంగా ఉండిపోయిన మూర్తివైపు చూసి నవ్వుతూ. "రా పోదాం, నీకేమన్నా మర్యాద తక్కువ చేశానా? మా సత్యవతేమన్నా అందా?" ఛలోక్తిగా అన్నాడు పరంధామయ్య.

"సత్యవతికి అర్థంలేని సిగ్గు....అది నాకు ఇష్టం లేదు మామయ్యా." అప్రయత్నంగా అనేశాడు మూర్తి.

"అర్థంలేనిదే సిగ్గెలావస్తుంది?... అదా?" అంటూ సంతోషంగా నవ్వి "దాన్ని కూడా నీతో ఫ్రీగా మాట్లాడెయ్యమంటాను, సరా? బస్‌తప్పిపోతుంది పోదాం రా." అన్నాడు పరంధామయ్య. అతనికీ తెలుసు, తాను పెళ్ళిసంగతి చెప్పిన దగ్గరనుంచీ సత్యవతి మూర్తితో మాట్లాడటం మానేసిందని.

రూమ్‌కి తాళంవేసి పరంధామయ్య వెంట వచ్చేశాడు మూర్తి. ఛ ఛ. అలా అనకుండా ఉండాల్సింది అనుకుంటూ.

బస్ దిగుతూనే, "బామ్మదగ్గ రుంటాను. తర్వాత వస్తాలే మామయ్యా" అంటూ అతని మాట కెదురుచూడకుండా వెళ్ళిపోయాడు మూర్తి.

* * *

"ఏయ్ మూర్తీ. మానాన్నతో ఏమిటి చెప్పావట?" సుడిగాలిలా గదిలోకొచ్చిన సత్యవతినిచూసి తెల్లబోయాడు మూర్తి. ఈ ఆరునెలలై మాటలు మానేశారు కాని, ఇదివరకైతే సత్యవతిని మొద్దూ, మెతకా అనీ, నీకు చదువురాదనీ ఉడికించేవాడు మూర్తి, సత్యవతి పరీక్ష తప్పినప్పుడల్లా. ఐదవతరగతిలో ఓసారి, సెకెన్‌ఫారంలో ఓసారి తప్పింది సత్యవతి. సత్యవతి అన్నపూర్ణమ్మతో ఫిర్యాదుచేసేది 'చూడు మూర్తి నన్నెలా అంటున్నాడో' అని. 'ఆడపిల్ల దానికేం? చదివినాపోయె, చదవకున్నాపోయె. నువ్వుచదువుదూ' అని మనవణ్ని మందలించే దావిడ.

స్కూలుఫైనలు ఫలితాల్లో మూర్తి నెంబరు పేపర్లోలేదు. అప్పుడు సత్యవతి, "అబ్బాయిగా రెందుకు తప్పారో" అని ఉడికించింది. రాధకూడా 'మొద్దబ్బాయిల జాబితాలో నిన్ను చేర్చవచ్చా' అని నవ్వింది.

పుస్తకాలు రాగానే ముందు సత్యవతిని పిలుస్తూ పరంధామయ్య ఇంటికే వెళ్ళాడు మూర్తి. జామిచెట్టెక్కి, పిందెలు కొరికి దిగువుకి పారేస్తూ చెట్టుకొమ్మన కూర్చుంది సత్యవతి.

"ఏయ్ కోతీ, దిగిరా. ఇదిగో చూడు. నేనుమంచిమార్కులతో ప్యాసయ్యాను," అన్నాడు గర్వంగా నవ్వుతూ.

"ఛ, అబద్ధం," కొట్టిపారేసింది సత్యవతి.

"పందెం కాస్తావా?" అన్నాడు మూర్తి.

"ఎంతెంత?" సవాలు చేసింది సత్యవతి.

బుర్రగోక్కున్నాడు మూర్తి.

"ఒక్క మొట్టికాయ," అని కిలాకిలానవ్వింది సత్యవతి.

"సరె. దిగిరా." అన్నాడు మూర్తి.


చెట్టు దిగి, ఓ దోరజామికాయ మూర్తి చొక్కాజేబులో పెడుతూ, "ఏవీ మార్కులు చూపించు" అంటూ అతని పక్కన నిల్చుంది సత్యవతి.


అతను పుస్తకం తెరిచాడు.

ఆమె అతని తలపై సన్నగా మొట్టి తుర్రున ఇంట్లోకి పారిపోయింది.

ఆమెను తరుముకువస్తూ, పరంధామయ్య కనుపించగానే "ప్యాసయ్యాను మామయ్యా" అని పుస్తకం చూపించాడవ్వాళ.

'సత్యవతి పందెం గెలుచుకుం'దని అంటూ ఆమె తలపై టక్కున మొట్టాడు మూర్తి.




"అమ్మమ్మా! చూడు మూర్తి.." అంది గట్టిగా సత్యవతి.

పక్క వాటాలో ఉన్నావిడ, 'ఏంచేశావోయ్ మూర్తీ' అంటూ గదిలోకి తొంగిచూసి నవ్వేసింది.

"అహ ఏంలేదండి," అంటూ సత్యవతివైపు చురుగ్గా చూశాడు మూర్తి.

మూర్తికి సత్యవతినిచ్చి పెళ్ళిచేస్తారనీ, అందుకే పరంధామయ్యగారు మూర్తిని చదివిస్తున్నారనీ పల్లే పట్నమూ కాని ఆ ఊరంతా పాకిపోయింది.

ఆమె అలా అనగానే సిగ్గుపడిపోయిన సత్యవతి గిరుక్కున వెనుదిరిగి పరుగులాటి నడకతో ఇంటికి వెళ్ళిపోయింది.

పండగరోజున బామ్మతోపాటు పరంధామయ్య ఇంటికి వెళ్ళక తప్పలేదు మూర్తికి.

సత్యవతి ఎవరేమన్నా మూర్తితో మాట్లాడటంకాని అతని ఎదుటతిరగడంకాని చెయ్యలేకపోయింది. ఆమె స్వభావమే అంత. గలగల మాట్లాడటం చురుగ్గా తిరగడం చాతకాదు.

"బావా! బావా!" అంటూ నవ్వుతూ హాస్యాలుచేస్తూ వెంట వెంట తిరిగేది రాధ. నిన్న మొన్నటివరకూ 'మూర్తీ' అని పిలిచే రాధ 'బావ' అని పిలుస్తుంటే అదోలా అనిపించేది మూర్తికి. రాధే సత్యవతైతే సత్యవతే రాధైతే బాగుండుననుకునేవాడు. ఇప్పుడైనా మించిపోయిందేముంది? సత్యవతి వద్దు రాధని పెళ్ళిచేసుకుంటానని చెప్పాలనుకునేవాడు.

కాని ఎందుకనో చెప్పలేకపోయాడు. అతను ఇంజనీరింగు రెండవ సంవత్సరం చదివేటప్పుడు సత్యవతితో ఘనంగా వివాహం జరిగిపోయింది. చదువు పూర్తయి ఉద్యోగంలో స్థిరపడ్డాక సత్యవతిని కాపురానికి తీసుకువెళ్ళే ఒప్పందంతో.

సత్యవతి చదువు మరీ మందకొడి అయిపోయింది. ఫోర్తుఫారంవరుసగా మూడుసార్లుతప్పింది. తానుపరీక్ష ఫెయిలయినట్టు ఫీలయాడుమూర్తి. ఆమెకన్నా చిన్నదైనరాధ చకచకా పైకిచదువుతూంటే సిగ్గన్నా పడదు సత్యవతి. పరంధామయ్యతో, 'సత్యవతిని బాగా చదివించు మామయ్యా' అంటే నవ్వేసి ఊరుకుంటున్నాడు. తానే కలుగజేసుకున్నాడోరోజు. మూర్తి,కావాలని ఆమెగదిలో ఒంటరిగా ఉన్నప్పుడువెళ్లాడు. 'ఫోర్తుఫారం మూడుసార్లు తప్పావు. ఇహ మరి స్కూలుకెళ్ళకు. నా ఖర్మకొద్దీ దొరికావు. ఎవరన్నా నీ భార్య ఏం చదివింది అని అడిగితే ఫోర్తుఫారమని చెప్పడానికి తలవంచుకోవాలి నేను. ఇంజనీరుకి కనీసం బి. ఎ. చదివినదైనా భార్యకావాలి. నా ఖర్మ, నా తలరాత," అంటూ తలకొట్టుకున్నాడు మూర్తి.


సత్యవతి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. "నిజమే. కాని నేను చదవలేను. పోనీ ఫోర్తుఫారమని చెప్పకు, బి. ఎ. అనిచెప్పు ఇప్పుడు పోయిందేముంది? వారేం నన్ను పరీక్ష చేస్తారా!" రోషంగా అంది సత్యవతి.


"చాల్లే, సిగ్గులేమ. నోర్ముయ్."

ఆమె మౌనంగా ఉండిపోయింది. ఆనాటిమొదలు ఆమెను చూస్తే చిరాకుపడేవాడు అప్పడప్పడు మూర్తి. ఎంత తనను తాను సమర్థించుకున్నా 'తనకు బాగా చదివిన భార్యయితే' బాగుండును అనే కోరిక తలెత్తేది. దానితో హృదయంలో నిరాశ చోటుచేసుకునేది.

ఆ ఊరు వచ్చినా పరంధామయ్య ఇంటికి రావడం తగ్గించేశాడు. 'ఏం బాబూ! వచ్చావుగావు?' అని పరంధామయ్య అడిగితే, 'పెద్దచదువుకదూ మామయ్యా' కష్టపడాలి. అడుగడుగునా ప్రయాణాలుచేస్తే ఎలా అని నవ్వేశేవాడు. అతని ఖర్చులన్నీ పరంధామయ్య భరించేవాడు.

మూర్తి చదువు పూర్తయేసరికి పరంధామయ్యగారి మూడె




కరాల పొలం అమ్ముడయిపోయింది. అయినా అతనికి అల్లుడు ఇంజనీరు అవుతున్నాడనే తృప్తి, గర్వం.

అతని చదువు పూర్తయింది. సత్యవతిని కాపురానికి పంపించే ఏర్పాట్లు చేస్తానన్నాడు పరంధామయ్య.

"ఉద్యోగమవనీ మామయ్యా! ఇద్దరం చిన్నవాళ్ళమేగా" అని బిడియంగా నవ్వేశాడు మూర్తి.

సత్యవతిని మెట్రిక్ పరీక్షకు చదవమని వత్తిడి చేశాడు మూర్తి, ఓసారి వారింటికి వచ్చినప్పుడు.

"నేను చదువలేను మూర్తీ." నిస్సహాయంగా దీనంగా అంది సత్యవతి.

"చదవకపోతే అస్సలు నిన్ను ఏనాటికీ నేను కాపురానికి తీసుకెళ్ళను," విసురుగా అన్నాడు మూర్తి.

"నేనూ చూస్తాలే...ఎవరినన్నా బలవంతంగా చదివించ గలరేమిటి. నేను చదవను ఏంచేస్తావేం?" అని అక్కడినుంచి వెళ్ళిపోయింది సత్యవతి. ఆమెకూ ఓ రకమైన గర్వం, మూర్తంటే లోకువా ఉన్నాయి. తన తండ్రి డబ్బుతో చదివాడు. తనమీదెందుకీ అథారిటీ అని.

రాధ బి. ఎ. పరీక్షకి చురుగ్గా చదువుతూంది. రాధంటే మూర్తికి ఇష్టం. చెలాకీగా తెలివిగా ఉండేది. తనతో చనువుగా హాస్యాలుచేస్తూ, బావా బావా అని వెంట వెంట తిరిగేది. తాను పొరపాటుచేశాడు. సత్యవతిని వద్దని రాధని కోరుకోవలసింది. కాస్త ఛాయతక్కువైనా రాధ అందమే తన కిష్టం! ఇంజనీరునయాననే సంతోషంకన్నా సత్యవతి తన భార్య, అనే విషయం కృంగదీసే దతని మనస్సుని.

అన్నపూర్ణమ్మకి అకస్మాత్తుగా జబ్బుచేసి మృత్యుముఖానికి ఈడ్చింది. ఆమె తన మనవడిచెయ్యి పరంధామయ్య చేతిలోపెట్టి కన్నుమూసింది.

మూర్తిని తన ఇంటికి వచ్చెయ్యమని బ్రతిమిలాడాడు పరంధామయ్య. అతను నిరాకరించేడు. కొన్నాళ్ళుగా మూర్తి వైఖరి కనిపెట్టిన పరంధామయ్య నొచ్చుకున్నాడు.

ఎలాగైనా సత్యవతిని అతనిదగ్గరకు పంపించేస్తే మంచిదని, మూర్తికి వంటచేసి పెడుతుంది. ఇంక సత్యవతిని కాపురానికి పంపించేస్తాను, అని నచ్చజెప్పబోయాడు. తన కేదో కంపెనీలో ఓ పోస్టువచ్చిందనీ అక్కడ స్థిరపడ్డాక తీసుకుపోతాను అని తప్పించుకున్నాడు మూర్తి.

ఆ కబురు తండ్రిద్వారా విన్న సత్యవతి తనకై తాను మూర్తి ఇంటికెళ్ళింది.

"ఎందుకిలా వచ్చావ్? మీ నాన్న నాదగ్గరకు పొమ్మన్నాడా?" అడిగాడు మూర్తి నవ్వబోతూ.

"మా నాన్న నన్ను ఎప్పటికీ పొమ్మనడు."

"సంతోషం."

"నువ్వు మా యింటికివచ్చి ఎన్నిరోజులయిందో తెలుసా మూర్తీ?"

"అయితే ఏం ఇప్పుడు?"

"నువ్వు మారిపోయావు."

అతను మాట్లాడలేదు.


"కనీసం రాధతో మాట్లాడినట్టన్నా-నాతో సంతోషంగా మాట్లాడవు. నేనంటే ఇష్టంకాదా?"


"ఇష్టంకాదంటే మీ నాన్న నన్ను కోర్సుకీడ్చడూ."

"నాన్ననుంచి భయంతో నన్ను భార్యగా ఒప్పుకుంటున్నావన్నమాట!"

"ఛ ఛ. ఏమిటీ న్యూసెన్సు. వెళ్ళు. అస్సలెందుకు వచ్చినట్టు?"

చప్పున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "మేము ఊళ్ళో ఉన్నాం. నువ్వు హోటల్లో భోజనంచేస్తున్నావు. నాతో...




కొంచంసేపైనా పెళ్ళికాకముందు నవ్వుతూ మాట్లాడేవాడివి. ఇప్పుడు అస్సలు నేను కనుపిస్తేనే చీదరించుకుంటున్నావు. వద్దు మూర్తీ. నీ మనస్సులో నేనంటే అయిష్టతకు చోటివ్వకు. జీవితాంతం ఓచోట కలిసి బ్రతికేవారం. మన బ్రతుకులు నరకంచెయ్యకు."

"నరకమే అవుతాయో స్వర్గమో అవుతాయో తర్వాత సంగతి కాని, అస్సలు ఇప్పుడు నీతో మాట్లాడాలంటే నాకు అసహ్యంగాఉంది. ఫోర్తుఫారం మూడుసార్లు తప్పి, మెట్రిక్ కి చదువుపోనీ అంటే నా మాట గడ్డిపోచలా తీసిపారేశావు. నా మాట ఎందుకలా నిర్లక్ష్యంచేశావు. మీ నాన్న నన్ను చదివించాడని, మీ డబ్బుతో నేనింతవాడినయ్యానని, ఎవడికోసం నిన్ను ఏలుకోనో చూద్దామని ! అవునా?"

"అహ. కాదు."

"కాకపోతే? ఆవేళ ఖచ్చితంగాచెప్పావు నేను చదవనని. ఇవ్వాళేకాదు. ఎప్పుడూ నీ నిర్లక్ష్యాన్ని భరించాలి నేను. వెధవని, తెలివితక్కువ వెధవని...స్కూలుఫైనలుతో ఏదో ఉద్యోగం సంపాయించిబ్రతికితే మీకింత లోకువయ్యేవాణ్ణా?"

"ఎవరు లోకువచేశారు నిన్ను ! నీ నీడచూసి నువ్వు జడుసుకుంటున్నావు. మా ఇంట్లో కొత్తగా అద్దెకు దిగినాయన భార్యను కథలు వ్రాయమని వేపుకుతింటున్నాడు. మొన్న ఆమెమీద చెయ్యిచేసుకున్నాడు, అతను చెప్పినట్టు విని, ఆమె కథలు వ్రాయడంలేదని. అలాఉంది నీ వత్తిడి?"

నవ్వి..."ఒకసారికి పదిసార్లుచదివితే ఎందుకు ప్యాసవవు ? కథలకీ చదువుకీ సాపత్యమా?" అన్నాడు మూర్తి.

"అంత ఒకటికి పదిసార్లు చదివి పరీక్షప్యాసై నేను ఉద్యోగంచెయ్యాలా ! ఎందుకు మూర్తి?"

"నేను చస్తే నువ్వు బ్రతకడానికి, సరా?"

ఆమె తలవంచుకుంది. చెక్కిళ్లమీంచి జారిపోయే కన్నీరు వత్తుకుని, "సరే, వెళ్ళిపోతాను. ఉద్యోగమేదో వచ్చిందని అన్నావట. ఎప్పుడు వెళ్తావు ?"

"రేపే పోతాను. అస్సలీ ఊరినుంచి పోతేకాని నాకు శని వదలదు."

అతనివైపు ఒక్కసారి చూసి వెళ్ళిపోయింది సత్యవతి. తమ ఇద్దరిమధ్యా జరిగిన సంభాషణ ఎవ్వరికీ చెప్పలేదామె. తానంటే మూర్తికి అస్సలిష్టంకాదు అనుకున్న సత్యవతి కుమిలిపోయింది.

* * *

మూర్తికి ఉద్యోగమై ఆరునెలలు దాటింది. పరంధామయ్య వ్రాసినఉత్తరాలకి జవాబుగావచ్చిన మూర్తిఉత్తరాలలనుచూసి సంతృప్తిపడని పరంధామయ్య, అల్లుడిదగ్గరకు ప్రయాణమై వెళ్ళాడు.

నవ్వుతూ మర్యాదగా పలకరించాడు మూర్తి. ఒకరోజు ఉండి మళ్ళీ సత్యవతిని అతని దగ్గరకు ఎప్పుడు పంపించడానికి మంచిదో చెప్పి "ఆరోజు నీకు సెలవుదొరుకుతుందా? వస్తావా ?" అడిగాడు పరంధామయ్య.

"కొత్తపోస్టుకదా. ఓ ఆరునెలలదాకా సెలవుపెట్టకూడదని ఏవేవో సాకులుచెప్పాడు మూర్తి. అంతేకాక తానే స్వయంగావచ్చి సత్యవతిని తీసుకువెళ్తానని చెప్పాడు.

"నిజమే" అని పొంగిపోయాడు పరంధామయ్య. "దసరాకి బట్టలు కుట్టించుకో" అంటూ వందరూపాయల కాయితం ఇవ్వబోయాడు. "వద్దు. మీ అమ్మాయికి చీర కొనండి." అని నవ్వుతూ తిరస్కరించాడు మూర్తి.

నవ్వుతూ సంతోషంగా అల్లుడికీ తనకూ మధ్య జరిగిన సంభాషణచెప్తున్న తండ్రివైపు జాలిగా చూసింది సత్యవతి. అస్సలు తన కూతుర్ని వదిలించుకోవాలనీ దూరంగా ఉంచాలనీ వేస్తున్న ఎత్తులివన్నీ. మూర్తి ఇంజనీరైన తర్వాత పూర్తిగా మారిపోయాడని ఎరుగని తండ్రివైపు.



మరి నాలుగునెలలు దొర్లాయి. మూర్తి రాలేదు సరికదా ఉత్తరాలు వ్రాయడం తగ్గించాడు. ఆ ఊర్లోఉన్న తన ఇల్లూ భూమీ అమ్మకానికిపెట్టాడు.ఆ మాట విన్న పరంధామయ్య నిర్ఘాంతపోయాడు. నమ్మలేకపోయాడు. ఈ సంగతి నిజమా అని మూర్తికి ఉత్తరం వ్రాశాడు. కాని మూర్తినుంచి జవాబు రాకపూర్వమే, 'ఇల్లూ భూమీ ఇన్నివేలకు పురోణీవ్రాయించుకున్నాను. రెండునెలలో బాబుగారు వస్తారు. రిజిస్ట్రేషను అయిపోతుంది' అని తానెరుగున్న షావుకారు చెబుతూంటె, వినలేకపోయాడు పరంధామయ్య.

"అమ్మాయ్. నువ్వో ఉత్తరంముక్క రాయి అంటె విన్నావుకాదు. చూచావా. మీ అయనేంచేస్తున్నాడో?" అని సత్యవతిని మందలించి వివరాలు చెప్పాడు.

విన్న సత్యవతి, వేలవంగా నవ్వి, "పోనీ, అవి అమ్మడానికన్నా వస్తాడు. అతనితో నన్ను పంపించెయ్. నీ మనసు కుదుటపడుతుంది" అంది.

"అదిగో అదోహటి. ఎన్నిసార్లు చెప్పాను. ఏకవచన ప్రయోగం చెయ్యకూడదని?"


తనతో కాపురంచేనేటప్పుడు అలా మీరు, వారు అనడం నేర్చుకుంటాలే నాన్నా!"


"ప్చ్ ఏమిటోనమ్మా! పొరపాటు చేశానేమో అనిపిస్తూంది!!"

"అనిపించడమేమిటి, నిజమే!"

"ఏమిటమ్మా!!..." కళ్ళు పెద్దవిచేసి ఆత్రతగా కలవరంగా కూతురువైపుచూస్తూ అన్నాడు పరంధామయ్య.

"అహా ఏంలేదు." నవ్వేసింది సత్యవతి. ఆమెకు తెలుసు మూర్తికి తానంటే మొదటే అంతఇష్టంకాదనీ తర్వాత తాను,




చదువుకోలేదని మరింత విముఖత చూపిస్తున్నాడనీ. వీలైతే తనను శాశ్వతంగా దూరంచేసుకోవాలనుకుంటున్నాడనీను. అందుకే ఆమె మానసికంగా శారీరకంగా బాగా కృంగి పోయింది. పచ్చగా బొద్దుగాఉండే సత్యవతి రంగుమాసి సన్నబడడంతో ఏవేవో టానిక్కులు తాగిస్తున్నాడు పరంధామయ్య. ఆమెకు జీవితంమీద అదొకరకమైన విరక్తి ఏర్పడింది. నేనెందుకు జీవించాలి? అని ప్రశ్నించుకునేది ఒక్కోసారి. జీవించక ఆత్మహత్యచేసుకుంటుందా, నిజ జీవితసత్యాలు ఎదుర్కోలేని పిరికిపందలా! ప్రపంచాన్ని వదిలి పారిపోతుందా! లేదు. ఎలానడుస్తుందో చూస్తుంది జీవితం. తనను ఉడికించి, కవ్వించి ఏడిపించే మూర్తి తనకు భర్త అయ్యాడు. తన తండ్రి ఏవో ఆశలు పెంచు కున్నాడు అతనిపైన. తన తండ్రంటే మూర్తికి ఇష్టమే, అభిమానమే, కృతజ్ఞతే. కాని అతని కూతురు సత్యవతే ఇష్టంకానిది, విషమైపోయినది,—అనుకున్న ఆమెగుండెల్లో దుఃఖం ఉబికి కళ్ళల్లో నీళ్ళగా దొర్లేది. కొంతవరకు మూర్తినీ సత్యవతినీ వారి సంబంధాన్ని అర్థంచేసుకుంది రాధ. అక్కయ్యా ఈసారి బావ వస్తే అతనివెంట వెళ్ళిపో. ఏవిటో తమాషాలుచేస్తున్నాడు అనేది రాధ, ఆమెచేతిని ప్రేమగా తన చేతిలోకి తీసుకుని. నవ్వేది మృదువుగా సత్యవతి. "వెళ్ళిపోయినంత మాత్రాన శాంతిగా జీవించగలనా రాధా!" అని.

"ఎందుకు బ్రతకలేవు. ఎందుకు నిన్ను భార్యగా చూడడు? బొమ్మయితే సరియైన బట్టలే కుట్టించి ఎరుగడు. నాన్న ఎంత డబ్బుపోసి చదివించారు మూర్తిని. అతని ఖర్చులన్నీ భరించి కొడుకులా ప్రేమించారు, ఎందుకనీ? తనకూతురుభర్తని. అంతేకాని, ఎవడో మూర్తికి అంతడబ్బు తగలేసి ఇంజనీరుని చేస్తారు??"

"నిజమేరాధా! అతనికుండేది కృతజ్ఞతమాత్రమే. డబ్బు మనకి అదే ఆర్జించింది. నా మీద ఆడబ్బుతో అతనికి మానసికమైన మమతా ప్రేమా రావాలంటే సాధ్యమా! కృతజ్ఞత, ఆశ, నామెడలో అతనిచేత తాళికట్టించాయి. ఈతాళి, ఈ బంధం తాలూకు పూర్తి అర్థంతెలుసుకోకుండానే భార్యాభర్తల మయిపోయాం. ఏదైనా ఇష్టంమున్నా లేకున్నా బంధం సాంప్రదాయం అని తలఒగ్గేదీ త్యాగంచేసేదీ ఆడదే రాధా! మగవాడు ఎంతయినా ఇష్టంలేనిదాన్ని దూరంగా నెట్టడానికే ప్రయత్నిస్తాడు. ఓ వేళ ఒత్తిడులకులోనై తలవంచినా, తానా పరిధిలో ఇమడలేడు. ఎదుటివారిని సుఖపెట్టలేడు. తానుశాంతిగా జీవించలేడు."

"అబ్బో. ఏమిటేమిటో మాట్లాడుతున్నావే! చదవక పోయినా బాగా ఎదిగిపోయావే" అంది రాధ నవ్వుతూ.


"మూర్తివస్తే అతని ఇష్టమొచ్చినట్టు బ్రతకంమటాను" అంది సత్యవతి.


తృళ్ళిపడి "అక్కయ్యా పిచ్చిపిచ్చిగా ఆలోచించి ఏ నిర్ణయానికీ రాకు. నాన్న అనుభవజ్ఞులు. నీ జీవితం తీర్చిదిద్ది వలసినబాధ్యత ఆయనది. నువ్వు ఆయన చెప్పినట్లు చెయ్యడం శ్రేయస్కరం,' అంది రాధ.

ఇది పోనాటి సంభాషణ.

సత్యవతికి సన్నగా జ్వరంరావడం ప్రారంభమై తర్వాత విడవకుండా లేవలేని పరిస్థితికి తీసుకువచ్చింది. పరంధామయ్య మూర్తికి ఎన్నో ఉత్తరాలు వ్రాసేడు రమ్మని. కాని అతని దగ్గరనుంచి నాకు ఆందోళనగావుంది. రావటానికి ప్రయత్నిస్తాను అని జవాబులు వచ్చాయి కాని అతను రాలేదు.

ఉడికిపోతున్నాడు పరంధామయ్య. 'దొంగవెధవ! విశ్వాసఘాతకుడు!' అని తిడుతున్నాడు. నిర్లిప్తంగా ఉండిపోయింది సత్యవతి. ఆమెకు తెలుసు మూర్తి తన చావు కోరుకుంటున్నాడనీ, అతనా వార్తకోసమే ఎదురుచూస్తున్నాడనీను.




ఆమెకు జ్వరం తగ్గింది కాని, ఏదో వాతం ఓరోజువచ్చి కాలు లాగింది. కోలుకుంటూంది కాని, కుంటుకుంటూ నడుస్తూంది సత్యవతి. పరంధామయ్య తలకొట్టుకు ఏడ్చాడు. 'ఇదేఖిటి భగవంతుడా! అసలే దానికాపురంకోసం బెంగ పెట్టుకు ఏడుస్తున్నాను. ఈ అవధ్యురాలను ఏలుకోవడానికి వాడేం పేచీపెడతాడో' అని.

"ఎవడికోసం ఏలుకుంటాడు! అక్కయ్యను కాదంటే బ్రతకనివ్వవద్దామూర్తిని?" రోషంగా అంది రాధ. సత్యవతి విరాగిణిలా ఉండిపోతూంది వారి సంభాషణవింటూ.

రిజిస్ట్రేషనుకోసం వారంరోజులు సెలవుపెట్టి మూర్తి వచ్చాడు. ఆమె కాలుసంగతి అతని చెవినపడిపోయింది. బస్సు దిగుతూనె తప్పుదన్నట్టు వచ్చాడు అత్తవారింటికి.

సత్యవతి జ్వరంతో ఎన్నాళ్ళు బాధపడిందో చెప్పి, "కొంచెం కాలులాగింది. ఫ్రీగా నడవలేకపోతూంది. క్రమంగా సర్దుకుంటుందనిచెప్పారు డాక్టరు." అన్నాడు పరంధామయ్య కళ్ళువత్తుకుంటూ. నిజానికి డాక్టరు క్రమంగా సర్దుకుంటుందని చెప్పలేదు. వస్తే మామూలుగా మళ్ళీరావచ్చు లేదా పోవచ్చు అన్నాడు.

కాఫీగ్లాసుతో వచ్చిన సత్యవతిని చూసిన మూర్తి మనసు విలవిలలాడిపోయింది. తలంతా రాలిపోయి, సన్నగా పాలిపోయి, ఓకాలు ఈడుస్తూవచ్చి తలవంచుకు నిల్చున్న సత్యవతిని వలకరించాలనిపించలేదు. కాని చుట్టూ పరంధామయ్య, రాధ, రామం వున్నారు. బాగుండదు అనుకొన్న మూర్తి, "ఎలావుంది ఆరోగ్యం"అన్నాడు నవ్వబోతూ.

"బాగుంది." అని అక్కడనుంచి నెమ్మదిగా వెళ్ళిపోయింది సత్యవతి. వెళ్ళిపోతూన్న ఆమెవైపు క్షణం పరిశీలనగాచూసిన మూర్తి, "మరి వెళతాను మామయ్యా." అన్నాడు లేచి నిల్చుంటూ.

"నేనూ వస్తాను పద. ఎక్కడికెళ్తావు? ఇల్లూ అదీ..." అంటూ మూర్తివైపు చూశాడు పరంధామయ్య.

"అవును అమ్మేస్తున్నాను. నేను మరో వూళ్ళో సెటిలయి పోతున్నానుగా" అన్నాడు.


క్షణం మౌనం తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి, "సర్లే పద వస్తాను." అంటూ మూర్తిని అనుసరించాడు పరంధామయ్య. ఆకలి లేదనీ, ఇప్పుడు తీరికలేదనీ, తర్వాత వస్తాననీ పరంధామయ్య ఇంటికిరాకుండా మూడురోజులు తప్పించుకున్నాడు మూర్తి. నాలగవరోజు పరంధామయ్య 'సత్యవతిని నీతో తీసుకుపో' అని అన్నప్పుడు, చిరాకుగా కనుబొమలు చిట్లించి, "ఆ సొట్టదాన్ని నా వెనుక వంపిస్తావా?" అన్న మూర్తి చెంప ఛెళ్ళుమనిపించాడు పరంధామయ్య. "ఏమిటి నీ ఉద్దేశ్యం. రంభలాటి పిల్లను నీకిచ్చాను. నీ ఖర్మ. అది జబ్బుపడి అలా తయారయింది. దాన్ని వదిలేస్తావా! ఎంత ధైర్యంరా నీకు"అంటూ.


"అనవసరంగా ఆవేశపడకు. న్యాయంగా ఆలోచించు. డబ్బుపెట్టానుకదా ఈ వెధవ నేను చెప్పినట్టు వినాలని అనుకోకు. నిజమే. నేనింతవాణ్ని అవటానికి కారకుడివి నువ్వు. అందుచేత రాధని నాకిచ్చి పెళ్ళిచెయ్యి. సత్యవతిని నీ దగ్గర ఉంచుకో."

"నోర్ముయ్. ఓసారి బుద్ధి గడ్డితిని అపాత్రదానం చేశాను. ఓ పిల్లగొంతుకోశాను. మళ్ళీనీకు మరొకతెనుఇస్తానా! ఎంత ద్రోహబుద్ధితో ఉన్నావు నువ్వు. ఒరేయ్ భగవంతుడూ, ధర్మం వున్నాయిరా. నువ్వు నాశనం...కాదు. బాగుపడవురా, నాకూతుర్ని ఉసురుపెట్టి—"

"చేసుకుని బాగుపడ్డానుగా. ఏంచేస్తావో నీయిష్టం. నీకూతురుమాత్రం నాకు అవసరంలేదు. కావాలంటే తన తిండీ, బట్టకీ అడుగు, ఇచ్చేస్తాను" అన్నాడు మూర్తి.

మళ్ళీ చెయ్యెత్తిన పరంధామయ్య చెయ్యి దించి మీసం




దువ్వుతూ "చూడు నిన్ను కోర్టుకీడ్చి ఏడుచెరువుల నీళ్ళు తాగించకపోతే నేను పరంధామయ్యనే కాను." అంటూ చరచరా వీధి గుమ్మం దిగిపోయాడు.

* * *

"రాధా ఒక్క ఉపకారం చేసిపెట్టవూ!" అడిగింది సత్యవతి.

పరంధామయ్య చెప్పిన మాటలు విన్నారు కాబట్టి అందరి వదనాలూ చిన్నబోయి ఉన్నాయి. వాతావరణం బరువుగా, విషాదంగా ఉంది. రాధా సత్యవతీ ఓ గదిలో ఉన్నారు. సత్యవతి మంచంమీద పడుకొనిఉంది. రాధ ఆమె పక్కని కూర్చుని ఉంది. ఇద్దరి కళ్ళూ వర్షిస్తున్నాయి.

"ఏమిటి చేసిపెట్టాలక్కయ్యా!" అంది రాధ.

"మీ బావని ఒక్కసారి రమ్మని చెప్పు. నేను రమ్మన్నానని చెప్పు"

"వస్తాడంటావా?" నవ్వింది రాధ.

"ఆఖరి సారిగా తన నొక్కసారి చూడాలనుకుంటున్నానని చెప్పు."

"అక్కయ్యా!............"

"అవును రాధా. నాన్న ఊరికే ఆవేశపడతారు కాని ఆలోచించరు."

"ఏమిటాలోచించాలి?"

"మూర్తి తరఫున కూడా ఆలోచించాలి."

"ఆలోచన!" పెదవు బిగబట్టింది రాధ.

"నిజం రాధా. నిజంగా అతని పరిస్థితిలో అన్నయ్య ఉన్నాడనుకో, మనమేమంటాం."

"చెలిమెతీసి భార్యను ఏలుకోమంటాం."

సత్యవతి మాట్లాడలేదు. చిన్నగా నవ్వింది.

మౌనంగా క్షణాలు దొర్లాయి.

నిజంగా ఒక్కసారి మూర్తిని చూడాలనీ అతని దగ్గరలో కూర్చుని రెండు మాటలు మాట్లాడాలనీ తపనగా ఉంది.

"రాధా ప్లీజ్. ఒక్కసారి ఆఖరిసారిగా నిన్ను మా అక్కయ్య చూస్తుందట రా అని పిలువు."

"రాకపోతే..."

"దురదృష్టవంతు డనుకుంటాను."

"అంటే! నిన్ను కలియడమే అదృష్టంగా భావిస్తున్నాడా అతను?"

"కాదు. నేను దురదృష్టవంతురాలను అనబోయి."

"సర్లే. పిలుస్తాను." అంటూ బాత్‌రూంవైపు నడిచింది రాధ. గబగబా అందంగా తయారయి మూర్తి ఇంటి వైపు నడిచింది. అతన్నిఎలాగైనా అన్నా సత్యవతి దగ్గరకు రప్పించాలనే పట్టుదలతో.

అనేకమైన ఆలోచనలతో మనస్సు కలతబారి, చిరాగ్గా అలసటగా ఉన్న మూర్తి, రాధ రావడంతో ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

గదిలోకొచ్చి కర్టెను సరిజేసి "బావా!" అని పిల్చిన రాధగొంతు రుద్ధమైంది.

తలెత్తి ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు మూర్తి.

"ఒక్కసారి అక్కయ్యకు కనిపించు. నిన్నొక్కసారి చూడాలనుకుంటూంది" అందామె.

"నే నామెను చూడాలనుకోవడంలేదు" చిరాగ్గా అన్నాడు మూర్తి.

ఉబికే కోపాన్ని అదిమిపట్టి, అతన్నెలాగన్నా సత్యవతి దగ్గరకెళ్లేలా చెయ్యాలనే నిర్ణయానికి వచ్చిన రాధ, "నాన్నతో ఏమేమో అన్నావట. నీకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుంటే అక్కయ్యతో మాట్లాడాలిగా" అంది నెమ్మదిగా.

నమ్మలేనట్టు "నిజమా" అన్నట్టు చూశాడు మూర్తి రాధవైపు.

"వచ్చి అక్కయ్యకు ఓ సారి కనిపించు, ప్లీజ్!" రాధ కళ్ళు నీటితో నిండాయి.

"మీ నాన్న ఇంట్లో ఉన్నాడా?" అడిగాడు మూర్తి.

"లేరు. పొలంవైపు వెళ్ళారు."

"సరే, వస్తాను వెళ్ళు."


"థాంక్స్" వెళ్ళిపోయింది రాధ.

* * *

తెల్లని కాయితం మడిచి మూర్తికివ్వబోతూ, "కాయితం మీద సంతకం చేశాను. పైన ఎలా కావాలంటే అలా వ్రాయించుకో. మళ్ళీ పెళ్ళి చేసుకో మూర్తీ!" అంది సత్యవతి.


దిగ్భ్రాంతిగా తెల్లబోయి ఆమెవైపు చూశాడు మూర్తి. ఆమె తననేదో నిష్ఠురాలాడుతుందనీ, నిందిస్తుందనీ, ఎలా తీసుకువెళ్ళడో చూస్తానంటూ సవాలు చేస్తుందనీ అనుకుంటూ పగిలిన హృదయంతో రగిలే మనసుతో వచ్చాడక్కడికి. తన వూహ తలక్రిందులయింది.

"తీసుకో మూర్తి, నువ్వు సంతోషంగా భార్యాబిడ్డలతో బ్రతకాలని కోరుకుంటున్నాను. నీ భార్యగా, నీ కీడును, నీ పతనాన్ని నేనుసహించలేను మూర్తి. తీసుకో. ఈ కాయితం




తీసుకో. త్వరగావెళ్ళిపో. ఈ ఊరు నుంచి కూడా తొద్వరగా వెళ్ళిపో త్వరలోనే మళ్ళీ పెళ్ళిచేసుకో. పెళ్ళి అయేంపర్యంతం నేనీ కాయితం ఇచ్చినట్టు మా వాళ్ళ కెవరికీ తెలియనివ్వకు. 'నన్ను తీసుకువెళ్ళడానికి కొంత వ్యవధి ఇవ్వమని నాన్నని అడిగి—నన్ను తప్పక తీసుకువెడతానని చెప్పి వెళ్ళిపో. గుట్టుగా వ్యవహరించు. నీకు నచ్చిన అమ్మాయిని పెళ్లిచేసుకో." వణికే గొంతుతో నెమ్మదిగా చెప్పిన సత్యవతి గొంతు పూడిపోయింది. చెక్కుల మీంచి ముత్యాల్లా కన్నీళ్ళు జారిపోయాయ్.






అతని హృదయం మార్ద్రమైంది. చలించింది. 'సత్యవతీ ఎక్కడున్నావే?' బిగ్గరగా పరంధామయ్య గొంతు. తృళ్లి పడ్డట్టయ్యారు మూర్తీ సత్యవతీ కూడా.

గబగబా కన్ను తుడుచుకుని, "మరి సెలవ్. నీకు జీవితంలో కనుపించను. భార్యగా నీ సౌఖ్యానికి ఏ విధంగానూ అడ్డు తగలను. వెళ్ళిపో." అంటూ వెనుదిరిగింది సత్యవతి.

* * *

ఓ రోజు వంట మనిషి రాలేదు. నిర్మల చిరాగ్గా కోపంగా ఇల్లంతా తిరుగుతూంది. అలాంటి సమయంలో రఘు "అమ్మా పాలు కలిపియ్యి. ఇడ్లీ కావాలి" అని పేచీ పెడితే రెండు అంటించి కుదేసి నోరు మూయించింది. సహించలేని మూర్తి "వాణ్ణెందుకు అలా కొడతావ్? ఇవ్వాల్టికి వంటచెయ్యి. ఆడదానివి కాదూ?" మందలించబోయాడు.

"నాకు వంట చెయ్యడం రాదు. నేను చెయ్యను. కేరియరు తెప్పించండి. వంటవాడు వచ్చేవరకూ ఏదన్నా హోటలునుంచి తెప్పించుకోవలసిందే." ఖచ్చితంగా చెప్పింది నిర్మల.

ఆమె జవాబుకి వళ్ళుమండింది మూర్తికి. కాని ఏం చెయ్యాలి. ఆమెకు డబ్బుంది. తాను పోషించాలని తనకు లొంగి ఉండాలనీ ఆమె ఏనాడూ అనుకోదు. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఆమె ఇష్టానికే తల ఒగ్గుతున్నాడు తను.

కేరియర్లొచ్చాయి మధ్యాహ్నం "రా వడ్డన చెయ్యి" అన్నాడు మూర్తి నిర్మలవైపు చురుగ్గా చూస్తూ.

"తల నొప్పిగా ఉంది. తినెయ్యండి. ఇప్పుడు నేను లేవలేను" అంది నిర్మల.

"నువ్వు వడ్డన చేస్తేకాని నేను భోజనం చెయ్యను" అన్నాడు మూర్తి.

"అయితే సరే. మీ ఇష్టం" అని పక్కకి తిరిగి పడుకుంది నిర్మల.

ఆ పూట మూర్తి భోజనం చెయ్యలేదు. సాయంత్రం వంటవాడు డ్యూటీలో జాయినయ్యాడు. రెండురోజులు నిర్మలపట్ల ముభావంగా ఉండిపోయాడు మూర్తి.

అత్యవసరమైతే ఇప్పుడిప్పుడు కాఫీ టిఫిన్లు చేస్తూంది నిర్మల. కాని బాగుండక వెంటనే వంటవాళ్ళనే ఆ పనులకు పురమాయిస్తుంది.

ఇటుపైన సత్యవతి తన ఇంట్లో వంట తయారుచేస్తుంది. తనకు అన్నం పెడుతుంది... అనుకున్న మూర్తి హృదయంలో సన్నని అలజడి రేగింది.

ఉదయం ఆఫీసుకి వెళ్ళుతూ నిర్మలని పిలిచాడు మూర్తి.

"ఎందుకు పిలిచారు?" అంటూ వచ్చింది నిర్మల.

"కాస్సేపు కూర్చుంటావా? ఓమాట చెప్పాలి" నవ్వుతూ అన్నాడు.

ఆమె కూర్చుంది. చిరునవ్వుతో ప్రశ్నార్థకంగా అతని వైపు చూస్తూ.

ఆమె ఎదర కుర్చీలో కూర్చుని. "నిన్న నా స్నేహితు డొకడు ఉత్తరం వ్రాశాడు. మంచి వంట మనిషి ఒకామె ఉందట."

"ఓ హాస్యం కాబోలు..."

"కాదు నిర్మలా. పాపం ఆ అమ్మాయి నాకూ తెల్సు. చిన్నప్పుడు మా ఇంట్లో అద్దెకు ఉండేవారు వాళ్ళు. ఆ అమ్మాయి భర్త మతిచలించి దేశాటనం పోయాడట. మరి జీవించడం ఎలా?"

"బాగుంది. జీవించడం ఎలా! ఏవిటండీ. ఎందుకలా తడబడుతున్నారు" నవ్వుతూంది నిర్మల.

"అది కాదు. ఆమెకు డబ్బులేదు. ఎలా బ్రతుకుతుంది?"


"వంటచేసి మనింట్లో బ్రతుకుతుందని అంటారు. అవునా?"

"ఆ అదే రమ్మని — అహ ఆ అమ్మాయిని పంపించమని వ్రాయనా ?"

"ఆ. అమ్మాయంటే ఎంత వయస్సుంటుంది ?"

"ఎంత వయస్సయితే మనకేం? వంటా వార్పూ శుభ్రంగా చేసి పెట్టడం అంతేకదా! పైగా వట్టితిండీ బట్టామాత్రమే. ఆ అమ్మాయికి జీతం ఇవ్వక్కర్లేదు."

ఈసారి ఆ వంట మనిషి గురించి ఆలోచనలో పడింది నిర్మల.




"ఏమంటావ్ ? తొందరగా చెప్పు లెటరు వ్రాయనా పంపించమని" మౌనంగా ఉండిపోయిన నిర్మల వైపు చూస్తూ ఆత్రుతగా అడిగాడు మూర్తి.

"ఆ అమ్మాయికి కావాల్సిన వారెవరూ లేరా!" అడిగింది.

"ఓ చెల్లెలుంది? కాని ఈమెను పోషించే స్థితిలో లేదట."

"ఆ అమ్మాయి వయస్సెంత ఉంటుందంటారు?"

బహుశా నీ వయస్సుండొచ్చు.

"రాయండి చూద్దాం."

మరి నిలవకుండా వెళ్ళిపోయాడు మూర్తి.

* * *

"థాంక్స్ బావా. అక్కయ్య ఆదివారం సాయంత్రం ట్రయినులో మీ ఊరు వస్తుంది. రిసీవ్ చేసుకో... " రాధ వ్రాసిన ఉత్తరం చదువుకున్నాడు మూర్తి. ఎనిమిది సంవత్సరాల తర్వాత రేపు మళ్ళీ చూడబోతున్నాడు సత్యవతిని. దీర్ఘంగా నిట్టూర్చి ఆ ఉత్తరం చించి పారేశాడు.

మర్నాటి మధ్యాహ్నం భోజనంచేస్తూ "ఆ అమ్మాయి ఇవ్వాళ వస్తుందట. స్టేషనుకి వెళ్ళాలేమో!" అన్నాడు మూర్తి నిర్మల వైపుచూస్తూ.

"ఎవరు? మీరా? నౌకర్ని పంపించకూడదూ!" అంది నిర్మల.

"ఆమెకు గుర్తు తెలియదుగా మన నౌకరని. నేనే వెళ్తాను."

* * *

స్టేషనులో హోల్డాలూ, పెట్టె, బేగ్ క్రిందపెట్టి దిక్కులు చూసే సత్యవతిని సత్యవతిగా గుర్తించలేకపోయాడు. అటూ ఇటూ కంగారుగా తిరుగుతూ రైలుపెట్టెలు వెతికే మూర్తిని సత్యవతే గుర్తుపట్టింది.

"మూర్తిగారూ !" ఏనాడో పరిచయమున్న గొంతువిని వెనుదిరిగి చూశాడు మూర్తి.

చిన్నగా నవ్వి తలవంచింది సత్యవతి.

"ఇవేనా ! సామాన్లు ?" అంటూ ఆమెదగ్గరకొచ్చాడు మూర్తి. సత్యవతి కురూపిగా కాలీడుస్తూ అసహ్యంగాలేదు. పచ్చగా, అందంగా, నిండుగా, హుందాగా, తన వెనుక చకచకా నడుస్తూంది. అతనికి కంగారుగా ఉంది. సంతోషంగా, భయంగా, బెదురుగా, ఎలా ఎలాగో మనస్సు నిలకడగా లేదు.

"మీకు పిల్లలా ?" అడిగింది సత్యవతి.

సత్యవతి గొంతులో నడకలో మాటలో తడబాటులేదు. కలవరంలేదు. భయం బెదురూ లేవు. ఒక ఆత్మీయుడ్ని అడిగినట్లు స్నేహితుడితో మాట్లాడుతున్నట్టుంది.

"ఇద్దరు. బాబు, పాప." పొడిగా సమాధానంచెప్పాడు మూర్తి.

"రాధ నీకు ఎలా ఉండాలో చెప్పిందా ?" అడిగాడు క్షణం మౌనం తర్వాత ఆమెవైపు చూడకుండానే.

"ఆ. తెలుసు భయపడకండి."

* * *


తనది కాని తన ఇంటికి వెళ్తూందిప్పుడు. తనభర్త భార్య తన నెలాచూస్తుందో ! ఎలా చూస్తుంది ! వంటమనిషిలా. అదిచెయ్యి ఇదిచెయ్యి అంటూ వంటలు పురమాయిస్తుంది బాగుండకపోతే చీవాట్లేస్తుంది. ఆమె భూషణ తిరస్కారాలొక్కలా జీర్ణించుకుని ఆమెకూ పిల్లలకూ వండిపెట్టి, వారి ఆదరణలో వారి కనుసన్నల్లో మెసిలి జీవితం వెళ్ళమార్చుకోవాలి. తన భర్త పిల్లలు తననెలా సంబోధిస్తారు ? తన వెర్రిగాని పెద్దమ్మా అంటారా ? మన్ననచేస్తారా ? సత్యవతీ అని పిలుస్తారు. కాలేజీవేళకి వండిపెట్టలేకపోతే పనిలోంచి పొమ్మంటారు. వంట కాస్త పాడయితే కసురుకుంటారు.

"అమ్మా ! ఇదేనండి ఇల్లు".

సత్యవతి ఊహలు చెదిరిపోయాయి. గేటుదగ్గర నిల్చుండిపోయింది. గేటుపట్టుకు రోడ్డువైపుచూస్తూ నిల్చున్నాడు మూడేళ్ళ రఘు.

అటువైపు సంతోషంగా ఆత్మీయంగా చూసింది సత్యవతి. నౌఖరు గేటు తెరిచాడు. లోపలికొస్తూనే రఘు నెత్తుకు ముద్దాడింది సత్యవతి.

నెమ్మదిగా తలవంచి లోపలికివస్తూన్న సత్యవతివైపు "ఇదేం వంటమనిషి ?" అన్నట్టు చూసింది నిర్మల.




నిర్మలను చూస్తూనే నమస్కరించింది వినయంగా సత్యవతి.

"నీ పేరు ? అయ్యగారు స్టేషనుకొచ్చారా ?" అడిగింది నిర్మల.

"ఆ. వచ్చారండి. నా పేరు సత్యవతి."

"ఆ సామాన్లు స్టోరు రూమ్‌లో ఉంచు రామయ్యా" అంది నిర్మల.

నిర్మల చేతిలో ఉన్న ఐదునెలల పాపను తీసుకు ఎత్తుకు ముద్దాడుతూ, "ఎన్నోమాసమమ్మా పాపకి ?" అని అడిగింది సత్యవతి.

"ఐదు." సత్యవతిని అసలు తనఇంట్లో ఉంచుకో వచ్చునా ! అనే ఆలోచనలో పడిపోయింది నిర్మల. మూర్తి వంటమనిషిగా సత్యవతికి చెప్పినప్పుడు సమ్మతించి రప్పించమని చెప్పింది. కాని, తనకన్నా ఎన్నోరెట్లు అందమైనది, వయసులో ఉన్నదీ. మూర్తి బుద్ధి మంచిదేకాని ఎవరునమ్మగలరు ? ఏ క్షణాన ఏస్త్రీని కోరుకుంటుందో మగవాడి మనసు. అతనూ సామాన్యుడే, శ్రీరాముడూ ఋష్యశృంగుడూ కాడుగా !

ఆలోచనలో తేలిపోతూనే ఫ్లాస్కులో కాఫీ గ్లాసులోపోసి సత్యవతికిచ్చింది నిర్మల.

కాఫీతాగి పెరటిలోకెళ్ళి స్నానంచేసి చీరమార్చుకు వచ్చింది సత్యవతి.

"ఇవ్వాల్టికి వంటచెయ్యనవసరంలేదులే సత్యవతీ, రా కాస్సేపు రెష్టుతీసుకో. వంటతన్ని రేపటివరకూ చెయ్యమన్నాం" అంది నిర్మల, ఆమెనెందుకు భర్తవదిలేశాడో అన్నీ అడగాలని ఆత్రుతపడుతుందామె.

పాపని వడిలో కూర్చోబెట్టుకుని కుర్చీలో కూర్చున్న నిర్మలకి దగ్గరగా దిగువున చలకిలబడికూర్చుంది సత్యవతి. నీకు పెళ్ళయిందనుకుంటాను." అంది నిర్మల సత్యవతివైపు పరిశీలనగాచూస్తూ.

"అయిందమ్మా !" సత్యవతి ధైర్యాన్ని చక్కబెట్టుకుంటూంది.

"మరి ! పాపం ..." అంటూ ఆగిపోయింది నిర్మల.

నిర్మల వదనంలో బెదురు, అనుమానం పసిగట్టిన సత్యవతి "నేను—నేను...ఆడదాన్ని కానమ్మా !" అంది.

"అదేమిటి ! అయితే మగవాడివా ?" ఆశ్చర్యంగా తీర్చిదిద్దినట్లున్న మొహం పచ్చనిఛాయ. నల్లని పెద్ద తలకట్టు. అవయవ సౌష్ఠవంగల సత్యవతివైపు చూస్తూ అడిగింది నిర్మల.

"మగవాడినీ కాను..."

"అయితే...అయితే...నీలోస్త్రీత్వం లేదన్నమాట ?"

"అవును. దాంపత్యజీవితానికి...అందుకే ఆయన నన్ను వదిలేశారు,"

"మతిచలించి దేశాటనంపోయాడని మావారు చెప్పారు?"

"అది నిజమే".

తేలిగ్గా గుండెలనిండా గాలి పీల్చుకుంది నిర్మల.

తర్వాత నిర్మలచేతుల్లోఉన్న పాపను తీసుకుని నిద్రపుచ్చి, "బాబూ. రా. నీకు అన్నంపెడతాను." అంటూ రఘునెత్తుకుంది సత్యవతి.

"ఉహు. అమ్మ." సత్యవతి దగ్గరనుంచి నిర్మలను చూపించాడు రఘు.

"నేను చందమామను చూపిస్తాను. నిన్నెత్తుకు అన్నం తినిపిస్తాను. నేను తినిపిస్తాను. ఏం బాబూ" రఘు బుగ్గ మీద ముద్దుపెట్టుకుంటూ అంది సత్యవతి.

వప్పుకున్నాడు రఘు.

రఘుకి అన్నం తినిపించి, మంచంమీద పడుకోబెట్టి జోకొట్టింది సత్యవతి. తనకు అన్నంపెట్టి గారంచేసే కొత్త వ్యక్తివైపు బిడియంగా చూసి కళ్ళుమూసుకున్నాడు రఘు.


"పిల్లల్ని అల్లరిలేకుండా నిద్రపుచ్చావే. నీకు పిల్లలు అలవాటా? అంటే మీ వాళ్ళ పిల్లల్ని సాకేదానవా?"

"అవును. అన్నయ్య పిల్లలకి నా దగ్గరే చేరిక."

"అయితే వాళ్ళని చూడాలని వెళ్ళిపోతూంటావు కాబోలు."

"వెళ్ళినా ఒక్క రోజుమాత్రమే. మళ్ళీ వచ్చేస్తానమ్మా. మా వదిన పుట్టింటికి వెళ్ళిపోయింది."

ఇంతలో మూర్తి రావడంతో అక్కడనుంచి తప్పుకుంది సత్యవతి.




"ఎలా ఉంది వంట మనిషి, నచ్చిందా?" నవ్వుతూ నెమ్మదిగా అడిగాడు నిర్మలను మూర్తి.

"ఉష్ నెమ్మది. మనిషి అంత ఇదిగా ఉందా? స్త్రీత్వం లేదట. పిచ్చెత్తి కాదు. ఇది అక్కర్లేక దేశాలుపట్టిపోయి ఉంటాడు మొగుడు. మంచి దానిలానే కనిపిస్తూంది. ఒదిలి పెట్టదు. పట్టితిండీ బట్టకీ ఎవరు కుదురుకుంటారు వంటకి?" రహస్యంలా నెమ్మదిగా అంటూంది నిర్మల.

'స్త్రీత్వంలేదట' అన్నమాట విన్న మూర్తి కనుబొమలు ముడిపడ్డాయి. తన స్థానం ఈ ఇంట్లో బలపరుచుకోవడానికి సత్యవతి చెప్పిన మాట ఇది...అని తట్టగానే చిన్నగా నవ్వుకున్నాడు.

*　　　*　　　*

రాత్రి రెండు గంటలవేళ నిద్దట్లో ఉన్న సత్యవతి ఎవరో జబ్బమీద తట్టడంతో కంగారుగా లేచి అరవబోయింది. ఆమె నోటిని మృదువుగా మూని 'ఉష్ గొడవ చెయ్యకు. అలా పెరటి వరండాలోపలకిరా. నీతో కొంచెం మాట్లాడాలి' అన్నాడు మూర్తి.

భయంగా బెదురుగా అతన్ని అనుసరించింది సత్యవతి.

"నిర్మల ఓ వేళ తెలివొచ్చి లేచినా బయటకు రాకుండా గది తలుపు గొళ్ళెం పెట్టాను. భయపడకు" అన్నాడు చిన్నగా నవ్వుతూ మూర్తి.

"ఎందుకు? ఏమున్నాయి మాటలు?"

"ఎనిమిది సంవత్సరాలు దూరంగా బ్రతికాం. మాటలే లేవా?"

ఆమె మౌనంగా ఉండిపోయింది. అతని వైఖరి ఆశ్చర్యంగా అనిపిస్తూంది.

తాను కూచుని సత్యవతి చెయ్యిపట్టి తన పక్కన కూర్చోబెట్టుకుంటూ "ఇప్పుడు నేను వచ్చేసిన తర్వాత సంగతులు చెప్పు" అన్నాడు మూర్తి.

"చెబుతాను. కాని నేను నీ ఇంటికి వంట మనిషిగా మాత్రమే వచ్చాను. నీ భార్యగా రాలేదు గుర్తుందా" అంది సత్యవతి అతనికి కొంచెం దూరంగా జరిగి కూర్చుంటూ.

"ఎలా వచ్చినా నువ్వేమనుకున్నా మనిద్దరికీ తెగ తెంపులు కాలేదు. అది గుర్తుందా? మళ్ళీ పెళ్ళిచేసుకున్నాను. కాని నీ మీద హక్కులు వదులు కోలేదు."

"వద్దు మూర్తీ. నన్ను కోరుకోకు. కోరుకుని నీ పచ్చని సంసారంలో చిచ్చుపెట్టుకోకు. అస్సలానాడు నువ్వు చెప్పినట్టూ విని మెట్రిక్ చదివి పాసై ఉంటే నాకేదన్నా జీవనోపాధి దొరికేది. ఇలావచ్చి మళ్ళీ నీ నీడ ఆశ్రయించే దానను కాను" దుఃఖంతో ఆమె గొంతు పూడిపోయింది.

కొన్ని క్షణాలిద్దరిమధ్యా నిశ్శబ్దంగా దొర్లాయి.


"ప్రశాంతంగా, సంతోషంతో సాగిపోయే మీ సంసారంలో నా మూలంగా కలతలు రాకూడదు. నేను రావడం నీ హృదయంలో అలజడి రేపింది కదూ? మూర్తీ. వద్దు మూర్తీ. నువ్వు తాళికట్టిన సత్యవతి చచ్చిపోయిందనుకో. ఇప్పుడు నీ ఇంటికి వచ్చిన సత్యవతి. భూకామందు పరంధామయ్య కూతురు కాదు. ఇంజనీరు మూర్తి భార్య కాదు. బంగారు మేడలు గాలిలోకట్టి ఆ ఊహా సౌధాల్లో విహరించి భవిష్యత్ జీవితం పూలబాటగా ఊహించి కలలుకని మురిసిపోయి నిన్నూ నీ మాటా నిర్లక్ష్యంచేసిన సత్యవతి చచ్చిపోయింది మూర్తీ. ఇప్పుడు నీ ఎదుటనున్న ఈ సత్యవతి కాంతి లేనిదీపం, వాసనలేని కాగితపు పువ్వు. చావలేక నీ పంచన బ్రతకాలని వచ్చిన నిర్భాగ్యురాలు. మూర్తీ, ప్లీజ్ నన్నెప్పుడూ జీవితంలో కోరుకోకు. అలాటి కోరిక ఉంటే చెప్పు...ఆ బావిలోదూకి ప్రాణం తీసుకుంటాను."

"సత్యవతీ..."

"అవును మూర్తీ. ఓనాడు నా మీద విముఖత పెంచుకోవద్దని బ్రతిమిలాడి ఏడ్చాను. నువ్వు నన్ను చీదరించుకుంటే అసహ్యించుకుంటే రంపపుకోత అనుభవించాను. ఇవ్వాళ నీ చూపులు నన్ను కోరుకుంటూంటే అంతకి వెయ్యిరెట్లు బాధగా ఉంది."

"సరే. నిన్నిప్పుడు నేను కావాలని కోరడం లేదు. ఏ మొహంతో మళ్ళీ నాకు భార్యవు కమ్మని కోరుకుంటాను? కానియ్. నేనొక దరిద్రుణ్ని. కొన్నిరోజులు ఈ ఇంట్లో ఉంటే నాది మేడిపండు జీవితం అని తెలుసుకుంటావు." అన్నాడు మూర్తి ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ,

"నువ్వు వెళ్ళాక...నువ్వు నిజంగా మళ్ళీవస్తావనీ నన్ను తీసుకువెళ్తావనీ ఆశించిన నాన్న...నువ్వు ఆదివరకుండే




ఊర్లోలేవనీ, ఉద్యోగం రిజైన్‌చేసి వెళ్ళిపోయావనీ, తెలిసి చిందులు తొక్కారు. బాధా, కోపం, నిన్ను తిట్టడం, ఏడవడం ఇలా ఒకనెల చాలా ఊర్లు తిరిగారు...నువ్వెక్కడున్నావో తెలుసుకోవాలని. నువ్వు పెళ్ళిచేసుకున్నావని తెలిసింది. భార్యఉండగా మళ్ళీ పెళ్ళిచేసుకున్న నేరానికి నీ మీద కేసు పెట్టడానికి సిద్ధమయ్యారు. అప్పుడు నేను నీకు అనుమతి పత్రం ఇచ్చినట్టుగా చెప్పాను.

పుట్టిన తర్వాత ఎప్పుడూ నా మీద చెయ్యిచేసుకోని నాన్న అవ్వాళ నేను స్పృహతప్పి పడేవరకూ కొట్టారు. వీధిలోకినెట్టి తలుపులు వేశారు. ఆరోజు ఆరోజు..."అన్న సత్యవతికి ఉప్పెనగా దుఃఖంవచ్చింది. దోసిట్లో మొహం దాచుకు రోదించింది.

"నన్ను క్షమించు సత్యవతీ." పశ్చాత్తాప హృదయంతో ఆర్ద్ర స్వరంతో అన్నాడు మూర్తి.

మళ్ళీ రెండుక్షణాలు మౌనంగాఉండిపోయింది సత్యవతి.

"మానసికంగా కృంగిపోయిన నాన్నకి శారీరకంగా కృంగిపోవడానికి ఎంతోకాలం పట్టలేదు. చివరిశ్వాస వదిలేవరకూ ఆయన నాతో మాట్లాడలేదు.

ముందు అన్నయ్యకీ తర్వాత రాధకీ పెళ్ళిళ్ళయ్యాయి. ఎవ్వరూ నీ ప్రసక్తిఎత్తుకోలేదు. పెళ్ళిచేసుకున్నదగ్గరనుంచీ అనుకుంటాను. నాకు నెలకో ఏభై పంపించేవాడివి నువ్వు."

"తెలివైనది రాధ...ప్చ్....నేనూ నా జీవితం మొద్దు బారిపోయాయి సత్యవతీ, యాంత్రికంగా బ్రతికేస్తున్నానంతే ...నిర్మలతో ఏమిటి చెప్పావట?" నవ్వబోయాడు.

"నేను ఆడదాన్నికాదని చెప్పాను. ఆమె భయాలు ఆమెకు ఉంటాయిగా!...సరే మరెప్పుడూ ఇలా నాతో మాట్టాడాలని ప్రయత్నించకు. నన్ను నీభార్యననే భావంతో చూడొద్దు." లేచి నిల్చుంది సత్యవతి.

బరువుగా నిట్టూర్చి తానూ లేచి నిల్చున్నాడు మూర్తి.

*　　　*　　　*

ఉదయం కాఫీగ్లాసు టేబిలుమీద పెడుతూన్న సత్యవతి వైపుచూసిన మూర్తి. "అప్పుడే స్నానమయిందా?" అడిగాడు.

"నాతో చనువుగా మాట్లాడకూడదు." నెమ్మదిగా అని. వెనుదిరిగి వెళ్లిపోయింది సత్యవతి.


చనువుగా మాట్లాడకూడదు. హు. ఎలా శాసిస్తూంది సత్యవతి! ఎంత మారిపోయింది సత్యవతి! ఒకనాడు తాను అసహ్యించుకుని ఆమెను భార్యగా భరించక తప్పదు కాబోలని ఏడ్చాడు. ఆమెను చూడకూడదనీ. ఆమెతో మాట్లాడకూడదనీ తప్పించుకుతిరిగాడు. ఈ నాడు ఆమెను చూడాలనీ ఆమెతో మాట్లాడాలనీ, ఆమె కావాలనీ కోరు కుంటూంది మనస్సు. స్టేషన్లో చిరునవ్వుతో తలవంచి నిల్చున్న సత్యవతిని చూసిన తన దృష్టి చెదిరిపోయింది. సత్యవతా ఈమె! అని నమ్మలేకపోయాడు. సత్యవతి...తన చేత తాళికట్టించుకున్న తన భార్య. మనసు ఉరకలువేసింది. నెమ్మదిగా నిర్మలకు నచ్చజెప్పి సత్యవతికికూడా భార్యగా స్థానం ఇవ్వాలనుకున్నాడు. కాని ఎదురుతిరిగింది సత్యవతి. ఆ నాడు తాను కాదన్నాడు సత్యవతిని. ఇవ్వాళ ఆమె తనను కాదంది. 'సత్యవతి తనఇంట్లో వంటమనిషి.' తనకు చదువుచెప్పించింది. తనచేత తాళికట్టించుకుంది. 'తనకింకో పెళ్ళికి అనుమతిచ్చింది. తన భార్యాపిల్లలకు వంటచెయ్య డానికి, వంటమనిషిగా తనింటికొచ్చింది. "ఆమె ఇంట్లో ఆమె వంటమనిషి" ఎందుకిలా చేస్తూంది సత్యవతి? నవ్వు కున్నాడు మూర్తి.

స్నానానికి వెళ్తూ చంటిపాపకు నీళ్ళుపోస్తున్న సత్యవతిని చూశాడు మూర్తి. "నిర్మలా, పిల్లలపనులూ ఆమెకు అప్ప గిస్తున్నావా?" అడిగాడు భార్యని.

"ఆమె తనకై తాను చేస్తూంది. నేనేం అప్పగించలా. అయినా పనివాళ్ళ విషయంలో మగవాళ్ళ జోక్యం అనవ సరం." చిరాగ్గా అంది నిర్మల.

"రఘుబాబూ. దా. స్నానంచేసి టిఫిను తిందువుగాని." రఘుని పిలుస్తూంది సత్యవతి. రానని మారంచేస్తున్న రఘుని బ్రతిమిలాడి స్నానానికి తీసుకువెళ్ళింది. అతని వళ్ళుతుడిచి బట్టలుమార్చి. "అమ్మా, అయ్యగారు టిఫిను చేస్తారేమో. ఓ సారి వెళ్తారా?" అడిగింది పేపరు తిరగేస్తూ యీజీచైర్లో పడుకున్న నిర్మలని.

"ఆయన టిఫినుచేస్తే నేనెందుకు? ఆయన వెళ్తారుకాబోలు




౹మైమవుతూంది చూడు. తర్వాత వీడికి టిఫినుపెట్టొచ్చు వీడూ నేనూ ఎక్కడికెళ్తాం" అంది నిర్మల నవ్వుతూ.

తెల్లబోయింది సత్యవతి. భర్త కాఫీ టిఫినూ సంగతి ఈమెకు అక్కర్లేదన్నమాట అనుకుంటూ వంటగదివైపు వెళ్ళింది.

అప్పటికే సత్యవతి రాకకోసమన్నట్టు డైనింగ్‌రూమ్‌లో టేబిలుముందు కూర్చున్నాడు. మూర్తి. సత్యవతి నిర్మలా మధ్య దొర్లిన సంభాషణావిన్నాడు.

టిఫిను ప్లేటూ, గ్లాసుతో నీళ్ళూ టేబిలుమీద పెడుతూ, "కాఫీ, ఇంకేదన్నా కావాలా ? అడిగింది సత్యవతి.

"కాఫీ." పొడిగా అన్నాడతను.

తొమ్మిదిగంటల ప్రాంతాన్న స్నానంచేసి టిఫినుతిని గదిలోకెళ్ళి ఏవో పుస్తకాలు తిరగేస్తూ కూర్చుంది నిర్మల.

"వంట ఏంచెయ్యమన్నారు ?" అడిగింది సత్యవతి.

"ఏంచేస్తావ్ ? ఏదో రెండుకూరలు, సాంబారుచెయ్యి. రఘుబాబు కారం తినలేడు. నన్ను అడగనవసరంలేదు. కావాల్సిన సామాన్లన్నీ స్టోర్‌రూమ్‌లో ఉంటాయి. నన్ను డిస్టర్బ్‌చెయ్యకు" విసుగ్గా అంది నిర్మల.

బాగుంది.తన ఇల్లూ తన సంసారం చక్కదిద్దుకునే అవసరం ఆమెకులేదూ ! ఉదయం పనిమనిషి వంటఇంట్లో ఉన్న గిన్నెలేవో ఏరుకుని కడిగితెచ్చింది. అటూఇటూ ఇల్లు ఊడ్చి వాకిట్లో కల్లాపి చల్లీ వెళ్ళిపోయింది నౌకరు. కుండీల్లో డ్రమ్ముల్లో నీళ్ళుపట్టాడు. బాయిలరు అంటించాడు. పక్కలు ఎత్తి వీధిలోకూర్చున్నాడు, బీడీకాలుస్తూ.

రవి "అమ్మా హార్లిక్సుకావాలి" అని ఏడుస్తూంటే. 'వంటావిడ అదే సత్యవతినడుగు' అని పొమ్మని బద్ధకంగా మళ్ళీ పడుకుంది. ఉదయం ఏడుగంటల వేళ నిర్మల. వంటఇంటి గడపలో గుమ్మంపట్టుకు నిల్చుని బెదురుగా లోపలికిచూసే రఘుని తాను పిల్చింది "దా బాబూ హార్లిక్సు కలిపిస్తాను" అంటూ. పాపలేచి ఏడుస్తూంటే విసుక్కుని నిద్రవుచ్చాలని జోకొడుతూంది నిర్మల. తానే చొరవగా గదిలోకెళ్ళి "పాపకి నీళ్ళుపొయ్యనా అమ్మా !" అడిగింది నిర్మలని.

"రక్షించావు. తీసుకుపో. పనిమనిషి మళ్ళీ పదిగంటలకి వచ్చి పిల్లలకి నీళ్ళుపోస్తుంది. కాని, నీ ఇష్టం! పోస్తే పోసెయ్. సత్యవతీ, ముందు కొంచం పాలుపట్టు పాపకి" అంది నిర్మల.

ఎంతాకలితో ఉందో పాప, కాళ్లలో పడుకోబెట్టుకు చెమ్చాతో పోస్తుంటే గబాగబా గ్లాసు పాలు తాగేసింది.

వంటగదీ, సామాన్లగదీ అన్నీ సవరించి తొక్కులు ఊడ్చింది సత్యవతి. ఇల్లంతా నీటుగా సర్ది పదకొండయ్యేసరికి వంట పూర్తిచేసి శుభ్రంగా మొహం కడుక్కుని తల దువ్వుకున్న సత్యవతి చురుకుదనానికి మెచ్చుకుంది నిర్మల.

"అబ్బ. సత్యవతీ ఇంటి జిడ్డంతా వదిల్చేశావు. వెధవలు ఎవరన్నా డబ్బుతిని, వెట్టిపనులే చేస్తారు. కాని ఇలా స్వంత ఇంటిలా సవరించారా? రఘుబాబుకి అన్నం పెట్టెయ్. నాకూ అన్నం వడ్డించు" అంది నిర్మల.

"అయ్యగారు...?" అంది సత్యవతి.

"ఆయనకి ఓ వేళేమిటి ఏ ఒంటిగంటకొస్తారో. అప్పటివరకూ కూర్చుంటే నా ఆరోగ్యం పాడవుతుంది. రా—నాకు వడ్డించేసి బాబుకి కాస్త నిన్నట్లా అన్నం తినిపించెయ్." అంది నిర్మల.

ఒక్కో ముద్దా రఘుకి కబుర్లు చెప్పి తినిపిస్తూంది సత్యవతి.

తాను భోజనం ముగించి లేస్తూ "ఆకలైతే నువ్వూ తినేయ్ సత్యవతీ" అంది నిర్మల.


"అయ్యగారు వచ్చాక తింటానమ్మా!" అంది సత్యవతి.

"సరే నీ ఇష్టం. బాబుని కాస్సేపు ఆడించు. పాప లేస్తే పాలుపట్టు. నన్ను లేపకు. అయ్యగారొస్తే అన్నం వడ్డించు" అంటూ తనగదిలోకెళ్ళి తలుపులు బిగించుకుంది నిర్మల.

బాగుంది. ఇదన్నమాట నిర్మల సంసారంచేసే తీరు.

వంటిగంట ప్రాంతాన—అలసి, నీరసంగా వడలిన వదనం చిరుచెమటలతో తడుస్తూంటే రుమాలుతో మొహం తుడుచుకుంటూ సత్యవతి కూర్చున్న వీధి గదిలో అడుగు పెట్టాడు మూర్తి.

బడలికగా ఉన్న అతన్ని చూసిన సత్యవతి హృదయం ద్రవించింది. అతని రాకనే పట్టించుకోకుండా నిర్మల నిద్రపోతూంది, ఫాను గాలిలో! ఛీ ఏం మనిషి? ఇతను ఎవరి




కోసం ఇలా ఎండా వానా ఖాతరుచెయ్యకుండా పనిచేస్తు న్నాడు ? తన కోసం తన పిల్లలకోసమేగా. నిద్రపోతూన్న పిల్లలవైపు సంతోషంగా చూస్తూ, పాప బుగ్గలూ బాబు తలా నిమిరి ముద్దుపెట్టుకున్న మూర్తివైపు చూసిన సత్యవతి నవ్వుకుంది. భగవంతుడెంత మమకారాలు పెట్టాడు మను ష్యులమధ్య? ఈ మమతానుబంధమే లేకుంటే ఈ బిడ్డల కోసం ఇతనలా శ్రమిస్తాడా ? అని

అతను తన గదిలోకెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. అతను తలుపు తెరచిన సవ్వడికి కాబోలు నిర్మలకి తెలివొచ్చి, బట్టలు మార్చుకుంటూన్న భర్తవైపు ఒక్కసారి చూసి మళ్ళీ కళ్ళు మూసుకు పడుకుంది.

బకెట్‌తో చల్లని నీళ్లూ, సబ్బు వరండాలో ఉంచింది సత్యవతి.

అతను బాత్‌రూమ్ వైపు నడవబోయాడు. "ఇదిగో ఇక్కడ కడిగేసుకొంటేసరి. వాకిట్లో ఎండకి గచ్చు కాలిపో తూంది" అంది సత్యవతి.

అతను మొహం కాళ్లూ చేతులూ కడుక్కున్నాడు. తువ్వాలతని చేతికి అందించిదామె.

"థ్యాంక్సు." సంతోషంగా ఆమెవైపుచూశాడు మూర్తి.

ఆమె కొసరి కొసరి ఆప్యాయంగా వడ్డనచేసింది. అతను భోజనంముగించి లేస్తూ. "జీవితంలో ఎప్పుడూ నన్ను విడిచి వెళ్ళిపోకు సత్యవతీ !" అతని గొంతులో ఆర్ద్రత.

అతను తిన్నకంచంతీసి తాను అన్నంపెట్టు కుంటూన్న సత్యవతి. "నువ్వుతినెయ్యకపోయావా"? అన్న మూర్తి ప్రశ్నకి తలెత్తిచిన్నగా నవ్వుతూ "మీకులేని ఆకలి నాకా ! నీడపట్టున కూచున్నదానను." అంది నెమ్మదిగా.

"కాలు కుక్కెదానవుగదా ! ఇప్పుడు ?..."

"ఇప్పుడే రోగమూలేదు. అన్నీనయమయాయి. వెళ్ళండి కాస్సేపు విశ్రాంతి తీసుకొండి."

"ఓ. బహువచన ప్రయోగం..."

"మీరిప్పుడు నాయజమానులు."

"ఇదివరకు ?"

"స్నేహితులు. నాభర్త. నా స్వంతం. ఎలానంబోధించినా అది నా ఇష్టం. ప్చ్. నిర్మల వింటుంది...వెళ్ళిపొండి."

వెళ్ళిపోయాడు మూర్తి.

* * *

వారంరోజులు దొర్లాయి. వంట ఎంతచేసినా ఏమితిన్నా పట్టించుకోదు నిర్మల. తనకూ పిల్లలకూ కావల్సిన సదుపా యాలు చూస్తేచాలు. అడుగడుగునా అమ్మా అమ్మగారూ ! అని వేధించే పంటవాళ్ళకన్నా సత్యవతి నయమనిపిస్తూంది. వంటా వడ్డనా, పిల్లలరక్షణా అన్నీ చూస్తూంది. సత్యవతిని వదిలి పెట్టకూడదు అనుకుంది కూడా. మూర్తి కూడా తనకేంకావాల్సినా కాఫీ భోజనం టిఫినూ, నీళ్ళూ ఇలాటివి సత్యవతినే అడుగుతున్నాడు.

ఆరోజు క్యాంపు కెళ్ళాల్సిఉంది. "సత్యవతీ నాపాంటూ షర్టూ కాస్త ఇస్త్రీచేసిపెట్టు" అని సత్యవతిని పిలిచిచెప్పాడు మూర్తి.

"మీకు మంచీ చెడ్డాతెలియదు ఆమె ఏమనుకుంటుంది ? పిల్లల్ని చేరదీస్తూందనీ, ఇంట్లోపనులు స్వతంత్రంగా చక్కబెడుతూందనీ నేను సంతోషిస్తూంటే వెళ్ళగొట్టేలా ఉన్నారు మీరు ! కాపోతే, ఇవ్వాళబట్టలు ఇస్త్రీ చెయ్య మన్నారు, రేపు వీపురుద్దమంటారు అనుకోదూ!!" నెమ్మదిగా మందలింపుగా అంది నిర్మల.

"ప్చ్. ఫర్వాలే ఏమీ అనుకోదు, అలాటిపనులు స్వంత చెల్లెలుకిచెప్పినట్టు చెప్పొచ్చు." అని నవ్వేశాడుమూర్తి.

"ఎన్నిరోజులు క్యాంపు? హోల్డాలుసర్దుకున్నారా !" అడి గింది నిర్మల.

"కాస్త కట్టిద్దూ. నాలుగురోజులుకి సరిపడా బట్టలుపెట్టి"

"సత్యవతీ." పిల్చింది నిర్మల.


"ఏమమ్మా !" పచ్చినిల్చుంది సత్యవతి.

"ఏంచేస్తున్నావు ? ఏదన్నా పనిచేస్తున్నావా ?"

"లేదు. ఇవిగో బట్టలు ఇస్త్రీచేశాను. ఏం చెయ్య మన్నారు ?"

"మరేం అనుకోక, అయ్యగారు హోల్డాలు నాలుగు జతలబట్టలు పెట్టికట్టేద్దూ."

ఒక్కసారి నిర్మలవైపుచూసి 'సరే' అంది సత్యవతి. భగవంతునిదయవల్ల ఈవిడకి ఈర్ష్యా అసూయా అనుమానం లేవు. తనభర్తపై పూర్తి విశ్వాసముంది. అనుకున్న సత్యవతి తేలిగ్గా నిట్టూర్చింది.




అతను క్యాంపు వెళ్ళేవరకూ అతనివెనుకే తిరిగింది సత్యవతి. "పాపా నాన్నకి 'టాటా'చెప్పు" అంది పాపనెత్తుకుని నవ్వుతూ సత్యవతి.

చివాలున వెనుదిరిగిన మూర్తి సత్యవతివైపు జాలిగా చూశాడు. నిజంగా ఆమెకేమీ బాధనిపించడంలేదా? సంతోషంగా, పిల్లల్ని నిర్మల్ని ఎలా ప్రేమించగలుగుతూంది? తన మీ దెందుకు కోపగించుకోదు. నిందించదు? ఏమిటీ ఈమె మానవాతీతురాలా? అనిపించింది.

* * *

నిర్మలా సత్యవతీ ఓ గదిలోనే పడుకుంటున్నారు. మూర్తిలేడు కనుక మాటల సందర్భంలో నిర్మలకి తోబుట్టువులూ తల్లితండ్రులూలేరని తెలుసుకుంది సత్యవతి. పిల్లలు బాగా మాలిమిఅవడంతో సత్యవతి తనదగ్గరే పడుకోబెట్టుకుంటూంది. నిర్మలవేసిన ప్రశ్నలకి పొడిపొడిగా సమాధానాలుచెప్పింది సత్యవతి. తనకెవ్వరూలేరని, అంతా మీరే అని స్ఫురించేలా.

"ఫ్చ్. పోనీలే సత్యవతీ. దేవుడు నిన్ను అన్యాయం చేశాడు. నేను బ్రతికిఉన్నంతవరకూ నీకేం భయంలేదు. వంటజేసి కాస్త అయ్యగారికీ పిల్లలకీ, సదుపాయాలు చేస్తూండు. నేను వంటచెయ్యననీ, ఆయనకువడ్డనచెయ్యననీ అయ్యగారు నామీద అప్పుడప్పుడు కోపగించుకుంటూ ఉంటారు. అలాటి చిరాకు ఆయనకు రాకుండాచెయ్యి. నీ జీతం నేనే ఇస్తాను." అంది గబగబా నిర్మల.

తేలిగ్గానవ్వి. "నా కెందుకమ్మా జీతం నాకేం ఖర్చులున్నాయి. తిండి బట్టా మీరేఇస్తారు." అంది సత్యవతి.

"అన్నట్టూ అవున్లే అయ్యగారుచెప్పారు...మా ఇంట్లోనే ఉండిపోదువుగాని నువ్వు, బాబు పుట్టేవరకూ. మా నాన్న ఉన్నారు. ఆయన వంటమనిషినీ, ఓ మా బంధువుల ఆమెనీ ఇంట్లోపెట్టి నాకుచేయించారు. పాప పుట్టినప్పుడైతే యాతనే అనుకో. పురిటి సమయం అయ్యేసరికి హాస్పిటల్లో చేర్పించారు. ఇంటిదగ్గర రఘుబాబు అల్లరి. నాలుగవనాడు ఇంటికివచ్చిననేను, ఎంత సేపు ఏడ్చానో. నన్ను ఇంట్లో వదిలి ఆవేళే మానటానికి వీల్లేదంటూ క్యాంపువెళ్ళారు అయ్యగారు. వంటవాడు పత్యంచేసి పెట్టడం. పనివాళ్ళు సరిగా పనులుచెయ్యక నన్ను అరిపించడం. పాపకి నాలుగు నెలలు వచ్చేవరకూ నా ఆరోగ్యం కుదుటపడలేదు. నువ్వు వచ్చిన తర్వాత, ఈ వారంరోజులూ నువ్వు నీ ఇంటిపనిలా బాధ్యతగా అన్నీ కల్పించుకుచేస్తూంటె మా అమ్మే బ్రతికి నా సంసారం దిద్దడానికీ, నా పిల్లల సంరక్షణచెయ్యడానికీ వచ్చిందనిపిస్తూంది నిన్నుచూస్తూంటే. పొగడ్తకాదు సత్యవతీ నిజం" అంది నిర్మల.

"ఎంతమాటమ్మా. జీవితాంతం మీ పంచనతలదాచుకోవాలనీ మీ నీడన బ్రతకాలనీ వచ్చినదానను. మీ కలాటి అభిప్రాయం ఏర్పడిందంటే నా అదృష్టమే." అంది సత్యవతి.

క్యాంపునుంచి తిరిగివచ్చిన మూర్తి ఓ స్నేహితుడ్ని తీసుకువచ్చాడు. నిర్మలకు పరిచయంచేశాడు. "వీడూ నేనూ కలసి ఇంజనీరింగ్ చదివేవారం. మధ్యలో చదువుమానేసి కాంట్రాక్టులుచేసి లక్షాధికారయ్యాడు. వీడిపేరు సుందర్రావు" అని.

"నమస్తే" అంది నిర్మల. "నమస్తే" అన్నాడు సుందర్రావు.

హడావిడిగా వంట గదిలోకెళ్ళి అతిథికి విందేర్పాట్లు చెయ్యమని సత్యవతికి చెప్పింది.

రాత్రి తొమ్మిదిగంటలదాకా ఏవేవో కబుర్లతో గడిపిన మిత్రులు భోజనానికై డైనింగ్ రూమ్‌లో కొచ్చారు.

తలవంచి నమ్రతగా వడ్డన చేస్తూంది సత్యవతి. ఆమె అందాన్ని పరిశీలనగా చూస్తున్నాడు సుందర్రావు.

అది గ్రహించని మూర్తి. "ఎలా ఉంది? కూర బాగుందా? మా సత్యవతి వంట బ్రహ్మాండం" అన్నాడు.

చిన్నగా నవ్వి, "బాగుండకేమిట్రా. హోటలు మెతుకులు తింటూ జిహ్వచచ్చిన వాడికి" అన్నాడు సుందర్రావు.

"అంటే?" మూర్తి కనుబొమలు ముడివడ్డాయి.

"మా అమ్మపోయి సంవత్సరం దాటింది."

'అమ్మపోతే భార్య" ప్రశ్నించాడు మూర్తి ఆశ్చర్యంగా. అతను వివాహితుడో కాదో తెలియదు మూర్తికి. స్టేషన్‌లో

30 పోలీసు వాళ్ళు ఊరూరు తిరిగారు ఇబ్బాగు!! ఊర ఇంట్లో దీపాలు వెలిగాయి!! టపా కాయలు పేలాయి!!



సుందర్రావుని చూడగానే 'రా' చాలాకాలం తర్వాత కలిశాం ఓరోజు ఉండిపో. మాట్లాడుకుందాం' అంటూ ఇంటికి తీసుకువస్తూ ఎక్కడ జాబ్ చేస్తున్నావనే ప్రశ్నకి, కాంట్రాక్టులుచేసి లక్షలు గడించానని చెప్పాడు. లక్షలు కాకపోతే వేలవవచ్చు. చూస్తే ధనవంతుడిలానే కనిపిస్తున్నాడు సుంధర్రావు.

గలగలా నవ్వి. ''లేదురా బ్రదర్. నేనింకా బ్రహ్మ చారినే" అన్నాడు సుందర్రావు.

"ఓ అయితే ముప్పై రెండేళ్ళ పెళ్ళికొడుకులూ ఉన్నారన్నమాట."

''ఆ - పాతికేళ్ళ అమ్మాయి ఉంటే చూడు" అన్నాడు సుందర్రావు. సుందర్రావు పెళ్ళికానంతమాత్రాన యవ్వనం జారవిడుచుకోలేదు. అయితే అతని కిప్పుడు కావాల్సింది ఇల్లు కనిపెట్టుకుని ఉండే ఆడది, భార్యా, ఇంకా తన పిల్లలకి తల్లిఅయ్యే అమ్మాయి. అలాటి కోరిక ఈ మధ్యనే పుట్టింది. తానెరిగిన బంధువులకు చెప్పాడు తాను పెళ్ళిచేసు కుంటానని. కాని ఎవరూ పిల్లనిస్తామని ముందుకి రాలేదు. చెడుతిరుగుళ్ళు ఉన్న మనిషి దగ్గర డబ్బునిలవదు. కట్టు కున్నది సుఖపడదు అనే నమ్మకంతో.

భోజనం ముగించి వక్కపొడి నములుతూ, ఆ మాటా ఈ మాటా మాట్లాడి ''సత్యవతి అంటే ఆమె ఎవరురా?" అడిగాడు సుందర్రావు.

''మా బంధువు లావిడ." అన్నాడు మూర్తి. ఎందుకనో వంట మనిషి అని చెప్పలేకపోయాడు.

"అంటే! విడోనా?"

"ఏరా ఫూల్! కనిపించలా! నుదుటబొట్టూ, గాజులూ."

"కొంతమంది ఇప్పుడు తియ్యడం లేదులే..." అని ఇంకేమో అడగబోయి. ''నీకు సెకెండు మేరేజ్ కదూ!" అన్నాడు.

అవును...

"మొదటామె..."

"ఉంది."

"ప్చ్. పాపం...ఎక్కడ?"

"వాళ్ళ వాళ్ళింట్లో."

ఇద్దరిమధ్యా కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

''మరి వెళ్తానా!" అంటూ లేచాడు సుందర్రావు.

"అరే ఇప్పుడెక్కడికి. ఆఫీస్ రూంలో పక్క వేయిస్తాను పడుకో."

''అహ. ఇబ్బంది పడకు అనవసరంగా. లాడ్జికిపోతాను. తెల్లవారుజాము మూడు గంటల ట్రెయినులో వెళ్ళిపోవాలి."

''సరే, నీ ఇష్టం, వచ్చిపోతూండు."

"అలానే."

వెళ్ళిపోయాడు సుందర్రావు.

* * *

''ఇదిగో, రాధ ఉత్తరం వ్రాసింది. ఈ మూడు నెలలయి ఆమెకు నువ్వు ఉత్తరం వ్రాయలేదా?" అడిగాడు మూర్తి సత్యవతి చేతికో కవరిస్తూ.

"లేదు" అంది సత్యవతి, కవరు విప్పి చదువుతూ.

''జవాబియ్యి" అంటూ మరొక కవరు ఆమె చేతిలోపెట్టి వెళ్ళిపోయాడు మూర్తి.

ఆ సాయంత్రం వ్రాసిన కవరు అతని చేతికిస్తూ "అడ్రసు వ్రాసి పోస్టు చెయ్యండి" అంది సత్యవతి.

''ఏమిటి వ్రాసింది రాధ?" అడిగాడు మూర్తి.

"నన్ను ఒకసారి రమ్మని."

''జవాబేమిచ్చావు?"

"ఇప్పుడు రావడానికి వీలవదని, నేను క్షేమంగా ఉన్నానని! నా గురించి బెంగవద్దని - చదవండి."

''ఎందుకు వీలవదు? వెళ్ళిరా!"

"ఎండలు విపరీతంగా ఉన్నాయ్. నిర్మల పనిచాతయిన మనిషికాదు. పిల్లలు పాడయిపోతారు."

"ప్చ్. ఇన్నాళ్ళూ నువ్వేచూశావా సత్యవతీ! నా గురించీ నా సంసారం గురించీ ఎలా ఉన్నానో అని ఆలోచించే దానవా?"

నిర్మల ఆ వరండాలోకి రాగానే ''సుందర్రావు ఇవ్వాళ వస్తానని వ్రాశాడు. సత్యవతీ అతనికి కూడా వంట తయారు చెయ్యి" అన్నాడు మూర్తి.

"వండిపెట్టేవారుండాలి కాని మనకి అతిథులకి లోటు రానివ్వరులే అయ్యగారు. సత్యవతీ నీ అదృష్టం" అంది నిర్మల.

"పోనీ లెండమ్మా! అన్నంలేక మనింటి కొస్తారా?" అనేసింది సత్యవతి.

''అలాటి వాళ్ళని పిలిస్తే నిర్మల వప్పుతుందా?" అన్నాడు నవ్వుతూ మూర్తి.

''ఆ. మహ ఇంతలో మీరు గొప్ప ఉదారులూ, నేను వినవారిసీను" అంది నిర్మల.

సుందర్రావు, ఈసారి మూర్తి ఒక్కడితోనే మాట్లాడి ముభావంగా ఉండిపోలేదు. బిస్కెట్ పేకెట్లిచ్చి రఘుని ఆడించాడు. పాపని నిర్మల దగ్గరనుంచి చనువుగా అందుకుని ముద్దులాడేడు. తర్వాత మీకు సినిమాలంటే ఇష్టమా! ఎలాటి సినిమాలు లైక్‌చేస్తారు! ఇంగ్లీషు, హిందీ సినిమాల గురించి మీ అభిప్రాయమేమిటి? ఇలా ఇలా నిర్మలతో కలిపి ఛలోక్తులు విసిరి నవ్వించి నవ్వాడు. అన్నంతింటూ 'మీ వంట బ్రహ్మాండంగా ఉంటుందండి' అని కూరా పులుసూ అన్నీ ఎలాఉన్నాయో చెప్పి పొగిడి. 'రేయ్‌మూర్తీ ఈమె మీ బంధువు అన్నావు గదా! నీకు సిస్టరవుతారా?' అడిగాడు సుందర్రావు.

మూర్తి జవాబు చెప్పేలోపలే. 'అవునండి' అంది సత్యవతి.

భోజనం ముగించి లేస్తూ. "నువ్వు మా యింట్లో మొహమాట పడనవసరంలేదు. నేను ఉన్నా లేకపోయినా వచ్చి భోజనం చేసిపోతూండు, ఎప్పుడు వచ్చినా' అన్నాడు మూర్తి.

'మొహమాటమైతే వచ్చేవాడినా!" అని నవ్వేశాడు సుందర్రావు.

మరొకసారి వచ్చినప్పుడు నిర్మలతో మాట్లాడి సత్యవతి తాలూకు వివరాలు కనుక్కున్నాడు.అయితే నిర్మల,సత్యవతి భర్త మతిచలించి ఎటో వెళ్ళిపోయాడనీ-పాపం ఏమీ తినడానికి లేక వంటమనిషిగా తమ ఇంట్లో పనిచేస్తూందని మాత్రమే చెప్పింది.

సుందర్రావు చురుగ్గా ఆలోచించాడు సత్యవతి గురించి. అందమైన ఆడది. పైగా దిక్కూమొక్కూ లేనిది. ఆమెను తనదాన్ని చేసుకుంటే తానెలా తిరిగినా, ఏంచేసినా, ఆమె తరఫున తనను మందలించేవారూ, పోట్లాటకు వచ్చేవారూ ఉండరు. తిండికి లేక వంటచేసి బ్రతికే మనిషి, భర్తగా ఆస్తిపరుడూ, తనకి ఈడైనవాడూ, వస్తూంటే కాదంటుందా! మూర్తితో ఈ విషయం సంప్రదిస్తే అనుకున్నాడు మొదట. 'కాని మూర్తికే ఆమెతో ఏదన్నా సంబంధముందేమో! మూర్తి చెప్పిన మాటలకీ నిర్మల చెప్పినమాటలకీ పొంతన కుదరలేదు. బంధువని మూర్తి చెబితే. తెలిసినది అని




meopta

RESEARCH MICROSCOPES

IMPORTED FROM CZECHOSLOVAKIA

with the assistance of State Trading Corporation of India Limited.

**FOR USE IN**

**BOTANY, ZOOLOGY, GEOLOGY, METALLURGY, CLINICAL, ENGINEERING AND INDUSTRIAL LABORATORIES.**

**Available Ex-stocks.**

**Please contact Sole Agents in India.**

**VIJAYA SCIENTIFIC EQUIPMENTS**

Congress Office Rd., VIJAYAWADA-2, Andhra Pradesh,

Phone: 3665 - Grams: 'EQUIPMENTS'

Branches: HYDERABAD & BANGALORE.

నిర్మల చెప్పింది.' కాస్త చనువు తీసుకుని సత్యవతినే అడగాలి అనుకున్నాడు.

అతనికి ఆఊర్లో అస్సలు ఏపనీలేకపోయినా, తరుచు మూర్తి ఇంటికి వస్తున్నాడు. ఏవేవో ప్రశ్నలువేసి సత్యవతిని మాట్లాడిస్తున్నాడు. ఏవేవో చలోక్తులు విసురుతున్నాడు. ఆమె ఒక్కతే వంటఇంట్లో ఉంటే కొంచం కాఫీ చేసి ఇస్తారా అనో, ఇవ్వాళ ఏమిటి వంట అనో ఆమెవైపు వెకిలిగా చూడటం నవ్వడం చేస్తున్నాడు.

అతనిరాకపోకలు సత్యవతికి ఇబ్బందిగా ఉన్నాయ్. చొరవా వెకిలితనం అసహ్యించుకుంటూంది. కాని ఏమన గలదు! మూర్తికి మిత్రుడు. నిర్మలా అతన్ని ఆదరంగానే చూస్తూంది.

మూర్తి క్యాంపులో ఉన్నాడు. మళ్ళీ వచ్చాడు సుందరరావు. అతనికి కాఫీ భోజనం మర్యాద చెయ్యక తప్పలేదు. సత్యవతికి ఏదన్నా పురమాయించడమే కాని నిర్మల ఏపనీ చెయ్యదు. ఆరోజు సాయంత్రమవగానే తలకి గుడ్డ కట్టి తలనొప్పని పడుకుంది నిర్మల. పిల్లలకి అన్నం పాలూ చూసి సుందర్రావు వస్తే అతనికి అన్నం పెట్టాలని కూచుంది సత్యవతి. రాత్రి తొమ్మిదిగంటల కొచ్చాడు సుందర్రావు. నిర్మలా పిల్లలూ నిద్రపోయారు. ఇల్లంతానిశ్శబ్దంగా ఉంది. కాళ్లూ చేతులూ కడిగి డైనింగ్ టేబిలుముందు కూర్చున్నాడు సుందర్రావు.

"సత్యవతీ మీరు భోజనం చేశారా?" అడిగాడు సుందర్రావు.

"తింటానులెండి. మీరు భోంచెయ్యండి." అంది సత్యవతి.

"నో, నా. మీరు నేను ఒకేసారి..."

"నే నివ్వాళ భోజనం చెయ్యను." ఆమె గొంతులో చిరాకు.

అన్నం కలిపి ఒక్కో ముద్దా నెమ్మదిగా తింటూ, "సత్యవతీ! పాపం మిమ్మల్ని చూస్తుంటే నాకెందుకో మనస్సు కరిగిపోతుంది. మీకేరకంగా నేను సాయం చెయ్యగలను! అని ఆలోచిస్తుంటాను," అన్నాడు.

"అంత జాలిపడాల్సిన అవసరం లేదండి. మూర్తిగారు చల్లగా ఉండాలి కాని నాకేలోటూ లేదండి."

"ప్చ్. పాపం... మూర్తి ఏమిస్తాడు! తిండీ...బట్టా... విధవా వివాహాలు అంటే ఆడదాన్ని భర్త వదిలేశాడనుకోండి. లేకపోతే పిచ్చివాడనుకోండి. ఆమెను మళ్ళీ పెళ్ళి చేసుకోవడం న్యాయం కాదంటారా?"

"నేనేం మాట్లాడలేను. పెద్ద చదువుకున్న దాననూ కాను."


*With best compliments from Sun-Sip*

**DRINK SUN-SIP**
REAL FRUIT BEVERAGES
CHILLED
KNOWN
FOR ITS
QUALITY WORLD OVER

***For all Trade enquiries :***
***Please Contact***

***MANJIRA AGENCIES***
**36, Lal Bahadur Stadium, Hyderabad - 500001.**
**Phones : 35342 & 34322**

"చదువుకుంటే ఈ ఉద్యోగమెందుకు చేస్తారులెండి కాని అభిప్రాయం చెప్పడానికి చదువుకోవాలా? మీ అభిప్రాయం?"

"అది ఆమె మనస్తత్వంపై అధారపడి ఉంటుంది. న్యాయమో, అన్యాయమో! దానిమాటకేం గాని తప్పులేదు ఆమె మళ్ళీ పెళ్ళిచేసుకుంటే."

"కరెక్టు...కంగ్రాచ్యులేషన్సు...అదే నాకు కావాల్సిన జవాబు."

"మీరలాటి ఆమెను ఉద్ధరించాలనుకుంటున్నారా?"

"అదే...మీరేమీ...అనుకోకపోతే."

"బాగుంది. నేనెందుకు అనుకోవడం." నవ్వింది సత్యవతి. అతను తన గురించే అంటున్నాడని గ్రహించకపోలేదు. కాని ఇంకేం మాట్లాడతాడో వినాలని కోపాన్ని నిగ్రహించుకుంటూంది.

"నాకు లక్షకిపైగా ఆస్తివుంది! తినేవారెవరూలేరు. ఇంకా పెళ్ళీ చేసుకోలేదు." అని ఆగి సత్యవతి వైపు చూశాడు.

ఆమె ఏభావమూ వదనంలో వ్యక్తం కానియ్యకుండా తలవంచుకు నిల్చుంది.

"ఎంత అందంగా ఉంటావు నువ్వు. అసలీఇంట్లో వంటమనిషివనుకో రెవరూ. ఇల్లాలి వనుకుంటారు. మూర్తి పెళ్ళాన్ని గమనిస్తూన్నాను కదూ! ఓ, గొప్ప గర్వం. ఈవిడ నిన్నెన్నాళ్ళు ఆదరంగా చూస్తుంది. ఆవిడ కదలకుండా చాకిరీ చేస్తున్నావు. అందుకని నీకు తిండి పడేస్తుంది. మూర్తిగాడు వట్టి మెతక. లేకపోతే నిన్ను కేవలం వంటమనిషిగానే చూస్తాడా! నాలాటి వాడయితే" మళ్ళీ ఆగి ఆమెవైపొక్కసారి చూశాడు.

"నీ పోయిన భర్త వస్తాడనీ, నీకు తిండీ బట్టా ఇచ్చి ఏలుకుంటాడనీ నమ్మకం లేదు. నీ అందం ఈయవ్వనం ఎందుకు వృధా చేసుకుంటావ్? సరే అను. రేపు ఉదయం మూర్తిరాగానే రిజిష్టర్ మేరేజీ... కుదరదేమో! తీసుకుపోతాను నిన్ను వాడికి చెప్పి."

ఆమె పక్క గదిలో కెళ్ళిపోయింది. అతను గబగబా భోజనం ముగించి, ఆ గదిలో కెళ్ళి వెనుదిరిగి నిల్చున్న సత్యవతి భుజంమీద చెయ్యివేశాడు.

చివాలున అతని చెయ్యి వెనక్కితోసి అతనివైపు తిరిగి అతని చెంపపై ఛెళ్ళుమనిపించింది సత్యవతి.

అతనిలోని పురుషత్వం, పౌరుషం విజృంభించాయి. చప్పున ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. అతని చేతుల్లో గిలగిలలాడుతూ, నీళ్ళబిందెమీదున్న పళ్లెం కాళ్ళతో తన్నింది సత్యవతి.


*With best compliments from*

**Shree Sreenivasa Welding Works**

**AMIRPET, HYDERABAD-500016. Phone : 3 8 1 1 2**

*Manufacturers of*

GATES, GRILLS, PIPECOTS, STEEL-WINDOWS
& WATER HEADTANKS Etc.

OUR SPECIALITY IN MANUFACTURE OF
TRANSFORMER TANKS

ఆ శబ్దానికి నిర్మల లేచి కంగారుగా ఇవతలికొచ్చింది. సత్యవతిని వదిలి గుమ్మంలో కొచ్చి... 'పిల్లి...పిల్లి...' అన్నాడు సుందర్రావు.

నిర్మలను వాటేసుకుని బావురుమంది సత్యవతి.

"ఏమండీ అదంతా నటన. నన్ను...నన్ను..." తడబడ్డాడు.

"నిర్మలా... అమ్మా... అతన్ని ముందు ఇంట్లోంచి గెంటెయ్ నువ్వు నా చెల్లెలు లాటి దానివి..." అరిచింది సత్యవతి

"మిష్టర్, వెళ్ళిపొండి. ఆయన ఇంట్లోలేరు. ఆడవాళ్ళం మీకిది మర్యాదకాదు". ఓదార్పుగా సత్యవతి తలనిమురుతూ అంది నిర్మల, సుందర్రావువైపు చురుగ్గా చూస్తూ.

"నన్ను మీరు అపార్థంచేసుకోకండి. ఆమెను మీ ఇంట్లోంచి సాధ్యమైనంత త్వరలోప ంపించెయ్యండి. మీమేలు కోరిచెబుతున్నాను. ఆమె వ్యభిచారిణి," అంటూ విసురుగా వెళ్ళిపోయాడు సుందర్రావు.

నవ్వింది నిర్మల. "వ్యభిచారిణిట"...అంటూ

కొన్నిక్షణాల తర్వాత, "ఏం జరిగింది సత్యవతీ !" అడిగింది నిర్మల,

సుందర్రావుకీ తనకూ మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పిన సత్యవతీ వదనం రోషంతో కందిరంది. "నేను పేదరాలిననీ దిక్కులేనిదాన్ననీ, పిడ్నీ...పిడిడబ్బూ చూసి పిడివెంటపడే వ్యభిచారిననీ అనుకుని వాగాడు వెధవ ...ఈసారి...ఈసారి. వాడీ గుమ్మంతొక్కడానికి వీల్లేదు" అంది సత్యవతి పెదవులు వణుకుతూంటే.

గల గలా నవ్వింది నిర్మల. "ఎందుకు సత్యవతీ అలా పౌరుషపడతావ్. ఏ మగాడన్నా నిన్నేంచెయ్యగల"డంటూ.

* * *

నిర్మల నవ్వుతూ చెప్పిన ప్రతిమాటా తీవ్రంగా హృదయం స్పందిస్తూంటే, ఆతృతగా విన్నాడు మూర్తి. అతని వదనం కోపంతో జేవురించింది. కళ్ళల్లో ఎర్రజీఱలు తేలాయ్. ఆ క్షణంలో ఎదురుగా సుందర్రావుంటే ఖూనీచేసే వాడేమో !

"ఎవడయితే మాత్రం సత్యవతిని ఏంచెయ్యగలడండీ !" మళ్ళీ నవ్వింది నిర్మల.

"ఏమీ చెయ్యలేడు. కాని ... ఈ సారి సుందర్రావుని ఇంటికి రానియ్యకు. వాడిగురించి కొంతతెలుసు నాకు. వాణ్ణి ఆదరించడం ఇంటికి రానివ్వడం చనువివ్వడం నాదే పొరపాటు" అన్నాడు మూర్తి.

"అతను...మంచిమనిషి కాదా ?"


*Compliments for the Season*

# NOTA BENE ENTERPRISES

**III-S-30, Lal Bahadur Stadium, Hyderabad-500001.**

## PRODUCTS HANDLED

**DOMESTIC**

Crompton Lamps & Tubes
Crompton Fittings
Crompton Ceiling and Table Fans
Sumeet Mixers
Larsen & Toubro Fuse Switches
Tenby Pilot Electrical Accessories

**INDUSTRIAL & AGRICULTURAL**

Loadster Miniature Circuit Breaker
Crompton Exhaust Fans
Crompton Metal Clad Plugs & Sockets
Crompton Motors & Pumpsets
Essen Deinki Control Accessories
Larsen&Toubro Eutectic Welding Alloys

"కాదు. తిరుగుబోతు...అయినా మనకేం అనుకున్నాను. కాని ఇవ్వాళ సత్యవతయింది రేపొద్దున నీ దగ్గరా అలా ప్రవర్తించేవాడేగా !"

"నిజమే..."

రఘుని హృదయానికి హత్తుకుని కళ్ళుమూసుకున్న సత్యవతిని, మూర్తి జబ్బపై తట్టి "ఓసారిలే"...అనగానే ఉలికిపాటుగా లేచికూర్చుంది.

మూర్తిని చూస్తూనే గుండెలు దడదడలాడాయి. కళ్ళ నిండుగా నీళ్ళుతిరిగాయి.

"ఎందుకలాఉన్నావంటే, జలుబుచేసిందని తప్పించుకున్నావ్. నా దగ్గర దాచాలనేనా ? ... నువ్వలా వంటమనిషిగా జీవితం జీర్ణించుకునేకన్నా, మరొకతని భార్యవై సుఖపడతావంటే సంతోషించేవారిలో మొదటివాడిని నేను. అతను నీ కిష్టమైతే..." అన్నాడు మూర్తి.

చివాలునలేచి అతని హృదయంపై తలఆన్చి వెక్కి వెక్కి ఏడుస్తూ, "మూర్తీ. అలా అనకు మూర్తి. నన్ను అపార్థంచేసుకోకు. ఏవో సుఖాలు కావాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. నీకు ఆ నాడు కాయితం ఇచ్చిన తర్వాత ... నాకేమీవద్దు నీ ఇంట్లో లభించే ఈ ఆదరణచాలు...నాకే కోరికలూలేవు. నన్నిలా నీ పంచనపండి రాలిపోనీ మూర్తి," అంది.

అతను మౌనంగా ఉండిపోయాడు ఆమె తలనిమురుతూ. కొన్నిక్షణాల తర్వాత అతన్నుంచి కొంచెం వెనక్కి జరిగి... "నిర్మల నీకు అన్నీ చెప్పిఉంటుంది, "స్వేచ్ఛగా నీ భార్యలా నీతో ఎలా మాట్లాడగలను ! ఏమి చెప్పగలనంతకన్నా ! నువ్వలా కవ్వించి ప్రశ్నిస్తూంటే జలుబని చెప్పాను." అంది సత్యవతి. "స్వేచ్ఛమాట ఒదిలెయ్. ఏకాంతంలోకూడా భార్యలా మెసులుకోడానికి వప్పలే నువ్వు ?...నువ్వెలా నిర్వ్యిచారంగా ఉండిగలుగుతున్నావో. నన్ను పరాయివ్యక్తిగా ఎలాచూడగలుగుతున్నావో. కాని... నాకు...మాత్రం...నిజంగా చాలాబాధగాఉంది. మా ఇంట్లో దాసీలా నువ్వు ప్రవర్తిస్తుంటే, పశ్చాత్తాపమో మరేమిటో నా హృదయం విడచగట్టుకుపోతూంది."

"నా ఇంట్లో నా పనులు నేను చెయ్యటంలో దాసిలా కనిపిస్తున్నానా ! బలేవాడివే. కాని ఇలా ఏకాంతంలో నన్ను కలియవద్దని చెప్పానుగా."

"నేను సహించలేను సత్యవతీ. నిర్మలకు నిజంచెప్పేస్తాను నా భార్యగా నువ్వూ ఉండొచ్చు ఈ ఇంట్లో. ఇద్దరు భార్యలున్నవారు చాలామంది ఉన్నారు. కాదనకు ... ఆ వెధవ, నువ్వు నాకేమీ కావని. వంటమనిషివనేగా చొరవ చెయ్యగలిగేడు. నా భార్యవని తెలుసుంటే, అలా ప్రవ

*With Best Compliments of*

## UNITED STEEL ALLIED INDUSTRIES

D - 4, 5, 6, Govt. Industrial Estate, Moulali,
HYDERABAD-40. : : Phone : 71293

FOR PRESSURE VESSELS, CHEMICAL EQUIPMENTS

Transmission Line Towers, Structural Steel Fabrication and Erection, Exothermic Compounds and Hot Top Inserts

ర్తించగలిగేవాడా! నువ్వు ఇతరులదృష్టిని ఆకర్షించబడటం, నిన్ను వారు తేలిగ్గా చూడటం నేను సహించలేను. ఇద్దరు భార్యలైతే సుఖశాంతులు తక్కువవుతాయనేగా నీ అనుమానం. అవనీ. ఫర్వాలేదు. నిర్మల నోటిమీదుగా విన్న ప్రతిమాటా నా గుండెల్ని అగ్నిచురకలలా కాల్చింది. ఇక్కడకన్నా మీ అన్నయ్య ఇంట్లో గౌరవంగా బ్రతికి ఉంటావు. నాకన్నా మీ అన్నయ్య నిన్ను అభిమానంగా చూశాడు. ఇలాటి అవమానం మీ అన్నయ్యఇంట్లో అయితే పొందవు!"

"ఏ మూలనో నీ హృదయంలో భార్యననే భావం అలా ఆవేశపరుస్తూంది నిన్ను. నీభార్య సత్యవతి ఏనాడో చచ్చిపోయింది. ఆ సత్యవతిలో అందం గుణం నీకు కన్పించలేదు. ఆమె నీ నుంచి విడిపోవడమే భాగ్యంగా భావించావారోజు. "అత్తింటి కోడలిగా అడుగుపెట్టలేదీ సత్యవతినీ ఇంట్లోకి! దాసిలానే. తిండిబట్టాయేకాక రక్షణకూడా కోరి వచ్చింది. మూర్తీ ప్లీజ్ వెళ్ళిపో. 'తన భర్త మరొక స్త్రీతో సంబంధం పెట్టుకుంటే ఆ భార్య పడేబాధ, వేదనా ఎటువంటివో, ఎంత దుర్భరమైనవో నాకు తెలుసు. నిర్మల సరోవరంలా ఉన్న 'నిర్మల' ప్రశాంత హృదయంలో అశాంతి, అలజడి రేగనివ్వకు. అటువంటి శిక్ష ఆమెకొద్దు. వెళ్ళిపో. మూర్తీ వెళ్ళిపో. ఇటుపైన నీ ఇంటికి వచ్చే మగ అతిథుల ఎదుట నేను పడను. నా గుతించీ నా సుఖం గురించీ ఆలోచించకు. చివికిన అన్నం పదునుకి రాదు."

"నువ్వుమాత్రం భార్యవు కావా!''

"నేను నీతో కాపురం చేస్తానంటె, నీ ఇంటికి వస్తానను కుంటే, నిర్మల నీ చేత తాళికట్టించుకోదు. కాను. నేను నీ భార్యను కాను. నీ పిల్లల తల్లే నీ భార్య" ఆమె దోసిట్లో మొహందాచుకు మూగగా రోదిస్తూంది.

తాను నిర్విచారంగా ఉండగలుగుతూందట. అతన్ని పరాయి వ్యక్తిలా చూస్తున్నానట. అలా అయితే...నా మనస్సెందుకు క్షణం క్షణం వేదనతో అలమటిస్తుంది! ఈ సంసారం ఈ భర్తా తనకై తాను కాలతన్నుకుందిఅవివేకంగా. చెడిన రూపం శాశ్వతమనీ, వంగినకాలు మరి రాదనీ భ్రమించి మూర్తికై జాలితో కరిగిపోయి ఆనాడతనికి కాయితంమీద సంతకంచేసి ఇచ్చింది. ఆ సంతకంలో మరొ కామెతో జీవితం మలుచుకున్నాడు మూర్తి. ఆరోగ్యం చక్కబడి, కాలువంకపోయి అందంగా అజంతా శిల్పంలా ఉన్న తనని చూసి రాధ ఎంత పనిచేశావక్కయ్యా! నీ బ్రతుకులో నువ్వు నిప్పులు పోసుకున్నావని తిట్టింది, ఏడ్చింది. మూర్తి నిర్మలతో మాట్లాడుతూంటే, నవ్వు




తూంటే ఆమె గదిలోకెళ్ళి తలుపు వేసుకుంటూంటే తనకి పిచ్చెక్కిపోతూంది. అతను తనకు పరాయివ్యక్తి అనుకుంటే అలాటి బాధెందుకు? అసూయెందుకు? ఆ క్షణాల్లో మూర్తిని పిల్చి అతనికి తాను లొంగిపోవాలనిపిస్తుంది. కాని... అప్పుడు తానొక్కతే కాదు, ఇలాటి వేదనకు గురిఅయ్యేది నిర్మల కూడా ... పాపం నిర్మల ఏం తప్పుచేసింది. తానెందు కనుభవించాలి ఇలాటి వేదన. నేనే అనుభవించాలి. పనికట్టుకు ఇంటికి పిలిపించి కాయితం వ్రాసిచ్చానే? దానికి ఫలితంగా తండ్రి హృదయం మండించి ఆయనను బలి గొన్నానే. నాకు కావాల్సిందే ఈ శిక్ష అన్పింస్తూంటే!

బాధగా నిట్టూర్చి "సత్యవతీ ఏడవకు. ఈ ఇంటికి మరి అతిథుల్ని పిలవను. వెళ్ళిపోతున్నాను. నీ ఇష్టం, నన్ను దూరంగానే ఉంచు" అంటూ వెనుదిరిగాడు మూర్తి.

"మన కుటుంబ క్షేమంకోరి, పిల్లల భవిష్యత్ బాగుండాలని నే నీ నిర్ణయం తీసుకున్నాను. మూర్తీ నేనేనాటికీ నీ భార్యగా నిర్మలకు తెలియ నివ్వకు" అంది సత్యవతి.

అతను వినిపించుకోనట్లు వెళ్ళిపోయాడు.

అతని కారాత్రి నిద్ర సరిగా పట్టలేదు.

అమాయకంగా ఆ రోజు తన చేతిలో కాయితం పెట్టిన సత్యవతి రూపం కళ్ళలో మెదిలి, హృదయం ద్రవించి మనస్సు కలతబారి కన్నులు చెమ్మగిల్లాయి. ఎంత త్యాగం చేసింది సత్యవతి! తానెంత స్వార్థపరుడు.

సత్యవతికి స్థానం ఇవ్వడానికి తన మనస్సంగీకరించ లేదు. సత్యవతిని భార్యగా అంగీకరించనినాడు తాను గుమస్తాగా స్థిరపడేవాడు అంతే!

ఎంత ఆలోచించి పరిష్కారం తోచని మూర్తి మనస్సు వికలమయిపోయింది.

తెలతెలవారుతూంటే కన్నులు మగతనిద్రతో మూతలు పడ్డాయి మూర్తికి.

"అమ్మగారూ మా చెల్లెలు రమ్మని వ్రాసింది. ఓసారి వెళ్ళివస్తాను" అంది సత్యవతి నిర్మలవైపు చూస్తూ.

"బాగుంది సత్యవతీ. ఇంట్లో వంట అదీ ఎలా జరుగుతుంది. అయినా పిల్లలు నీ కోసం బెంగపడరూ!" అంది నిర్మల.

నిజమే! పిల్లలు సత్యవతి దగ్గర బాగా చేరికయ్యారు ఈ సంవత్సరకాలంలో. తన భర్త పిల్లలుగా వారిని మనసారా ప్రేమిస్తూంది సత్యవతి. మూర్తీ, నిర్మలా సినిమాలకీ, షికార్లకీ పిల్లల్ని సత్యవతి దగ్గర వదిలి వెళ్ళిపోతూంటారు. ఒక్కోసారి పిల్లలిద్దర్నీ చెరొకప్రక్కా పడుకోపెట్టుకుని నిద్రపోతుంది సత్యవతి. పిల్లల్ని నెలరోజులు వదిలి ఉండటమంటే ఆమెకూ కష్టమే.


దీపావళి శుభాకాంక్షలు

మురళి ప్రింటర్స్

3-3-723, కంచరబజార్,

సికింద్రాబాద్-3.

ఫోన్ : 76650

"మా చెల్లెలు నన్ను చూడాలనుంది, ఓసారి రమ్మని చాలారోజులై వ్రాస్తూందమ్మా. ఒక్కసారి వెళ్లి వచ్చేస్తాను" అంది సత్యవతి.

"ఏ ఊర్లో ఉందన్నావు నీ చెల్లెలు?"

చెప్పింది సత్యవతి.

"అయితే వంట మనిషికి కబురు చేస్తానుండు. వాడు వస్తానని వప్పుకుంటే వెళ్దువుగాని."

"ఎన్నిరోజు లుండమంటారు?"

"ఒక్క రెండురోజులుండి వచ్చేయ్. నువ్వు లేకపోతే ఈ ఇల్లు క్షణంవేగదు."

మనస్ఫూర్తిగా సంతోషంగా నవ్వింది సత్యవతి.

"అదేమిటి అలా నవ్వుతావ్? నీ కెప్పుడో చెప్పాను. జీవితాంతం మా ఇంట్లోనే నువ్వుండాలని...ఇంకా నీకు చీరలవీ కొనాలనుకుంటున్నాను." అంది నిర్మల. ఆమె వచ్చి ఇంత కాలమైనా చీరకొంటానని అనలేదు నిర్మల. మూర్తి రెండు మూడుసార్లు ఏదో పండగలకి నిర్మల బట్టలు కొంటూంటే సత్యవతికీ ఓ చీరతీసుకో అంటే ఆమెకేవో బట్టలున్నట్టే ఉన్నాయి. లేవంటే నా పాత చీరలేవో ఇస్తాను. మన ఇంట్లో ఉండేదేగా అంది. అలానే రంగు వెలిసిందని ఓ చీరా, పాత పడిందని ఓ చీర ఇవ్వబోయింది.

"వద్దు ఉంచండమ్మా. నాకు చీరలున్నాయి. అంత లేకపోతే నా చెల్లెలు కొని పంపిస్తుంది" అంది సత్యవతి. ఇంత వంటచేసిపెట్టి ఇంటిపనులు చేస్తున్నా, నిర్మల పాతచీరలు తాను కట్టాలంటే మనసు వప్పలేదు సత్యవతికి.

మర్నాడు సత్యవతి ప్రయాణమైంది. "పెట్టేగట్రాపట్టుకెళ్ళితే ఎన్నాళ్ళుండిపోతావో. సంచీలో రెండు చీరలు పెట్టుకువెళ్ళు" అని ఓ సంచీ ఇచ్చింది నిర్మల. పిల్లలు" తనను చూడకుండా పెరటితోవన స్టేషను చేరుకుంది, నౌకరుతో కలిసి. టిక్కెట్టు తీసివ్వమని నౌకరును మూర్తే పంపించాడు.

టికెట్ కొని సెకెండ్ క్లాస్ కంపార్టుమెంటులో కూర్చోమని ఆమెచేతికి టిక్కెట్టిచ్చి వెళ్ళిపోయాడు నౌకరు.

ఐదు నిమిషాల్లో ట్రెయిను కదలబోతూంది. "సత్యవతీ!" మూర్తి గొంతు. ఉలికిపాటుగా ప్లాట్‌ఫారంవైపు దృష్టి సారించింది సత్యవతి.

"ఇదిగో ఈ డబ్బు తీసుకెళ్లు. మీ చెల్లెలు కొన్నదని నాలుగు చీరలు కొనితెచ్చుకో. ఓ నెలరోజులు ఉండిరా. నిర్మల కేదో సాకుచెప్పొచ్చు" అన్నాడు. ఆమె వడిలోకి మూడు వందరూపాయల కాయితాలుపడేస్తూ.

"ఇంత డబ్బు ఏం చేసుకుంటాను? నాలుగు చీరల కింత

*With the best compliments from :*

**SRI RAMA & CO.,**

**4-6-546, ESAMIAH BAZAR,**
**HYDERABAD-500027.**
Phone : 5 1 8 2 8

PRINTERS PROVIDERS & DISTRIBUTORS FOR J. B. A. PRINTING INKS PVT. LTD., MADRAS. — DEALERS IN PRINTING MACHINES, CUTTING MACHINES, WIRE STITCHING MACHINES AND COMPLETE ACCESSORIES OF LEAD, LEAD RULES, SPACING MATERIALS ETC.

డబ్బెందుకు! ప్చ్. ఎందుకో మీరు కొంతకాలంగా మానసికంగా బాధపడ్తున్నట్టు కనిపిస్తున్నారు. నేనెందుకు వచ్చానా మీ ఇంటికి అని నేను బాధపడుతున్నాను." నెమ్మదిగా అని క్షణం తర్వాత, ''వేళపట్టున భోజనం చేస్తూండండేం! పిల్లల్ని కసురుకోవద్దని నిర్మలకి చెప్పండి. స్టోర్ రూమ్ తాళం వేస్తూండమని చెప్పండి. నిర్మలేమిటో నాలుగు రోజులై సరిగా భోజనం చెయ్యడంలేదు. ఆరోగ్యం సరిగ్గా ఉన్నట్టులేదు. ప్చ్. అశ్రద్ధమనిషి. డాక్టర్‌కి చూపించండి ఓసారి." గబగబా చెప్తూన్న సత్యవతి మాటలమధ్య చిన్నగా నవ్వుతూ 'నన్ను ఓ మాటకూడా చెప్పనివ్వవా?' అన్నాడు మూర్తి.

సిగ్గుపడింది సత్యవతి.

"వెళ్ళాక ఉత్తరం వ్రాయి, ఆఫీసు అడ్రసుకు. 'రాధకి నా అభినందనలు అందచెయ్యి' నువ్వూ నేనూ ఎలా కలిసి జీవిస్తున్నామో నిజం చెప్పేయ్, తానేది న్యాయమంటుందో"

రైలు గట్టిగా కూతపెట్టింది. ఆపై మూర్తి పెదవులు కదిలాయి కాని ఏమన్నాడో సత్యవతికి వినిపించలేదు.

ముందుకి సాగిపోతూన్న సత్యవతి కూర్చున్న పెట్టెవైపు చూస్తూ రుమాలూపాడు మూర్తి.

సత్యవతి కళ్లలో నీటితెర మెరిసింది.

* * *

రాధదగ్గర ఏ విషయం దాచలేదు సత్యవతి. అన్నీ చెప్పింది చెల్లెనికి. చెప్పేటప్పుడు గొంతు జీఱపోవడం, కన్నులు చెమ్మగిల్లడం రాధ గమనించింది.

"ప్చ్. అదృష్టం చేతికి అందివచ్చినా అనుభవించకుండా పరులకోసం జారవిడిచే మనుషులుంటారని అనిపిస్తూందిప్పుడు. ఏమిటక్కయ్యా! నీ చాదస్తం నువ్వూను. నీ నిర్ణయమే అంతా. నీ ఇష్టమే కానిఎదుట మనిషిని గురించి కూడా ఆలోచించాలిగా! అతను కావాలని నిన్ను కోరుకుంటూన్నప్పుడు, నీ అభ్యంతరాలు దేనికి" అంది రాధ.

''మూర్తి చప్పున అందంవైపు ఆకర్షితుడైపోతాడు. అలా అని పరస్త్రీలపై వ్యామోహపడతాడని లేదుసుమా! అతనికి కావాల్సింది నాతో అనుభవం. అంతే. ఆపై నిర్మలతో వైరంరావచ్చు. నాకు పిల్లలు కలగవచ్చు నేనూ, నిర్మలా, నా పిల్లలూ, నిర్మల పిల్లలూ, నలిగిపోడూ మూర్తి! అతనికి ఏదో ఆరాటమే కాని ఆలోచన లేదనిపిస్తుంది. ఎప్పుడో వదులుకున్న ఆశలు ఇప్పుడు నాలో రేకెత్తించడమెందుకు రాధా. ఏమిటో అంతా తలకిందులయింది. కాని నేను జన్మలో మూర్తి గడప తొక్కుతాననీ, అతన్ని చూస్తాననీ అనుకున్నానా?"


*With the best compliments from* :

**CHARMINAR**

**PRINTING INKS**

1-2-50, Gagan Mahal Road,
HYDERABAD - 500029.
Phone : 33065

"అదీ అనుకోనిదే జరిగిందనుకోకూడదూ! నువ్వు అతని భార్యగానే జీవించకూడదూ!"

పేలవంగా నవ్వి "ఒద్దు రాధా. నాలో అలాటి ఆశా బీజాలు నాటకు. నా బుద్ధి స్వార్థంవైపు తిప్పకు. పిల్లలు నన్ను ఒక్కక్షణం వదలరు తెలుసా. నేను అన్నం పెట్టాలి. పాలు పట్టాలి. నేనే నిద్రపుచ్చాలి."

"అయితే. ఆయా పనికూడా నీకే వప్పగించిందన్న మాట నిర్మల."

"ఆ ఇంట్లో వంటచేసేటప్పుడు వంట మనిషిననీ, పిల్లల్ని సంరక్షణ చేసేటప్పుడు ఆయాననీ అనుకోవడంలేదు. ఆ ఇల్లు నాదనీ, ఆ పిల్లలు నా పిల్లలనీ, అలసి ఆఫీసునుంచి వచ్చే మూర్తి గృహయజమానిగాకాక నా భర్త అనే భావమే నాది. నువ్వు నాతోడ పుట్టిన చెల్లెలువైతే, నిర్మల నేను కోరితెచ్చుకున్న చెల్లెలు. ప్చ్. పాపం నిర్మలకు సంసారం ఏమయిపోతుంది అనే బాధగాని లోభత్వంకాని లేవు. ఫలానా సామాను కావాలంటే వెంటనే తెప్పించేస్తుంది. అప్పుడే అయిపోయిందా అనీ, దుబారా చేశావనీ అనదు. వంట ఏం చేసినా నా ఇష్టమే. నా చేత్తోనే తనకి అన్నం పెడుతున్నాను. తన కేదన్నా తినాలనుంటే 'సత్యవతీ చెయ్యవా!' అని తల్లిని పిల్ల అడిగినట్టు అడుగుతుంది."

"వెంటనే చేసిపెట్టేస్తావ్" కిలకిలా నవ్వింది రాధ.

"చేస్తే తానొక్కతే తింటుందా. ముగ్గురం తింటాం. పని వాళ్ళకేమైనా ఇవ్వాల్సివస్తే అన్నం అవీ నేనే ఇస్తాను. వాళ్ళేదన్నా అమ్మగారూ! అని అడిగేసరికి సత్యవతమ్మ గార్నడుగు అంటుంది."

"ఓ, అయితే అన్ని బాధ్యతలు నెత్తిన వేసుకున్నావన్న మాట."

"అబ్బబ్బ. దాని మాటకేంగాని, నిర్మల పచ్చగా ఉంటుందా! ఎలా ఉంటుంది. ఆమె రంగుకి మేచయే చీర వదిలేసి, మిగతాది నేను ఎంచుకుంటాను."

"నీకన్నా ఓ చాయ తక్కువ. ఈ చీర బాగుందదూ! జాకెట్ బట్టకూడా మేచవుతుందికదూ దీనికి?" అంటూ బిస్కెట్ కలర్ చీర జాకెట్ బట్టా చూపించింది సత్యవతి.

"ఆ, అవి బాగుంటాయి. ఆమె కుంచు. నాకీ చీర ఇవ్వ కూడదూ?" అంది రాధ ముప్పయిరూపాయలకు కొన్న ముదురాకుపచ్చ చీర చూపిస్తూ.

"నీకి చీరే ఇస్తాను. కావాలంటే అదీ తీసుకో." అంది సత్యవతి.

"ఉహు వద్దు. అయితే నీ ఇష్టం" అనేసింది రాధ. ఆమె ఇస్తానన్న ఒక్కచీరమాత్రమే తీసుకుంటూ.


***Saving is one; its forms and benefits are many at . . . . . .***

**ANDHRA BANK**

Andhra Bank has so many attractive Saving Schemes for you : Savings Bank, Recurring Deposits, Fixed Deposits, Minors' Savings, Kiddy Bank Scheme........

And so many benefits ! Handsome interest, tax benefits, security........

Whatever your savings, whatever your age, or vocation — there is a good Saving Scheme to suit you.

***Start saving today with***

**THE ANDHRA BANK LTD.,**

Central Office

**Sultan Bazar, Hyderabad.**

M. V. SUBBA RAO
GENERAL MANAGER

K. GOPALARAO
CHAIRMAN

A NON-NATIONALISED BANK IN THE NATION'S SERVICE.

"రఘు నీకోసం బెంగపడ్డాడు. నిర్మలకూడా నిన్ను తొందరగా వచ్చెయ్యమని ఉత్తరం వ్రాయమంది. పాప సత్యవతి కావాలంటూంది. నేనూ నువ్వు కావాలంటున్నాను. చెల్లెలుతో కబుర్లు అయానను కుంటాను. వీలైనంత త్వరలో వచ్చెయ్," అని వ్రాశాడు మూర్తి, సత్యవతికి ఉత్తరం. తాను చదివి రాధకిచ్చింది ఉత్తరం సత్యవతి.

చదివిన రాధ, "అబ్బో సరసుడేనే. అవ్వాళ అతని అవతారంచూస్తే నాకు వళ్ళు మండిపోయింది. చాచి లెంప కాయ కొట్టాలనిపించింది." అంది రాధ నవ్వుతూ.

సత్యవతి వెళ్ళిపోతుంటే, "అతను అలా కోరుతుంటే అంత మూర్ఖంగా ప్రవర్తించకు." మరోసారి హెచ్చరించింది రాధ.

సత్యవతిని చూసిన ఆమె వదిన పార్వతీ, పిల్లలూ కళ్ళ నీళ్ళపెట్టుకున్నారు. తాను సంతోషంగా బ్రతుకుతున్నాననీ తన గురించి బెంగపడవద్దనీ వదినకిచెప్పి "మళ్ళా వస్తాను బాబూ!" అని పిల్లల్ని బుజ్జగించి రెండురోజుల తర్వాత ప్రయాణమైంది సత్యవతి.

అక్కడ ఎంతవద్దన్నా వినకుండా రాధ సత్యవతి పెట్టెలో నాలుగుచీరలు కొనిపెట్టింది. ఇక్కడ పార్వతి రెండు చీరలిచ్చింది. ఇన్ని చీరలు తాను తీసుకెళ్తే నిర్మల ఏమి అనుమానిస్తుందో అనిపించింది సత్యవతికి.

*  *  *

"అబ్బ, వచ్చావు తల్లీ. ఈ పదిరోజులూ యాతనయి పోయింది. అస్సలు నువ్వింక రావేమో" అనుకున్నాను. అంది నిర్మల.

"అలా ఎందుకనుకున్నారమ్మా!" నవ్వుతూ ప్రశ్నించింది సత్యవతి.

"బాగుంది. ఇల్లు సవరించి అన్నిపనులూ చేస్తానంటే మాకన్నా ఎవరన్నా జీతం బత్తెం ఇచ్చి భరిస్తామంటే వెళ్ళి పోవూ చెప్పు."

"నాకెందుకమ్మా జీతం! నేనెవరికిపెట్టాలి? నా భర్త పేదవారా! పిల్లలు పేదవారా?"

"ఉన్నారేమిటి కొంపతీసి భర్తా, పిల్లలూ?"

"నా డబ్బుకోసం ఆశించేవారెవరూ లేరని, నాకు డబ్బాశలేదనీ తెలిసి మీరెలా అనుకోగలిగారు. "ఈ రఘు బాబు నా పక్కనలేక ఈ పదిరోజులూ సరిగా నిద్రపోలే దంటే నమ్మండి."

"సత్తివతీ, మళ్ళీవెలిపోతావా!" సత్యవతి మెడచుట్టూ చేతులుచుట్టి, ఆమె చెంపకి తన చెంప ఆనిస్తూ వెనుకనుంచి మీదపడుతూ అడిగాడు రఘు.


*Deepavali Greetings*
*to all our Valued Customers & Well Wishers*

GOLDEN PRESS
**GOWLIGUDA, HYDERABAD, Phone: 44338**

*Specialists in*
**Carton Printing, Box making, Varnishing**
**Quality Competitive Promptness**

"వెళ్ళను బాబూ !" అంది సత్యవతి అతని బుగ్గ ముద్దు పెట్టుకుంటూ.

"ఓ, సత్యవతీ ఎంతసేపైంది వచ్చి ?" నవ్వుతూ పలకరించాడు మూర్తి. "ఇప్పుడే. ఓ అరగంట అయింది" అంటూ ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో వంచి అతని చేతికందించింది సత్యవతి.

"చూశావా ! ఇలానే. బాగామప్పేశావు సత్యవతీ అన్నీ !" అంది నిర్మల. మూర్తివైపు కొంటెగాచూసి నవ్వుతూ.

"ఎవరికి ? ఏమిటి ముప్పానమ్మా ?" తాను చిన్నగా నవ్వుతూ ప్రశ్నించింది సత్యవతి.

"మీ అయ్యగారికి. ఆయన దాహం కనిపెట్టి నీళ్ళూ, అలసటని గ్రహించి కాఫీ, ఆయన భోజనంచేస్తున్నంతసేపూ కాళ్ళుపీకేలా ఎదురుగా నిల్చుని, ఆయన అడగకుండా ఆయనకి కావాల్సిన పదార్థాలు వడ్డించడం అన్నీ ముప్పావు. అలవాటుచేశావు...నువ్వు వెళ్ళినది మొదలు వంటవాడిమీదా, నా మీదా ఒకటే విసుగు! ''

"ఓ. అయితే మీరు గ్రహించారన్నమాట. కనిపెడుతున్నారన్నమాట. మీ డబ్బు తినేదాన్ని ఆమాత్రం యజమానుల్ని కనిపెట్టకపోతే ఎలా !'' నవ్వేసింది తేలిగ్గా సత్యవతి.

"ఇక్కడ ఎలా మసులుకోవాలో బుద్ధులుగరపిందా నీ చెల్లెలు ?" అడిగాడు మూర్తి చిలిపిగా నవ్వుతూ.

''తాను బుద్ధితక్కువగా ఏం మసులుకోదు, చెల్లెలు బుద్ధులుగరపడానికి. ఎలా అన్నా సత్యవతంటే మీకు చొరవ జాస్తి. హాస్యాలు చేస్తారు. సత్యవతీ, కేవలం వంటమనిషి లానే ఉండిపో. అయ్యగారి పని కుదురుతుంది" అంది నిర్మల.

''నాకేం. ముందు కుదిరేది అమ్మగారిపనే." నవ్వాడు మూర్తి.

తర్వాత తాను తెచ్చిన చీరలూ, తనకు చెల్లెలూ, వదినా ఇచ్చిన చీరలూ చూపించి, "ఇవిగో మీకోసం తెచ్చాను. ఈ రెండుచీరలు బాగున్నాయా?" అంది సత్యవతి డెబ్భయిరూపాయల ఖరీదుచేసేది ఓ చీరా తనకుకొనుక్కున్న చీరలలో ఓచీర చూపిస్తూ.

"బాగుంది. నాకని కొనితెచ్చావా ! డబ్బెక్కడిది ? అయినా సత్యవతీ మేమంటే నీకెందుకింత అభిమానం ! మేము పరాయివాళ్ళమనే భావనరాదా నీకు ?" ఆశ్చర్యంగా సత్యవతి వదనంలోకిచూస్తూ అడిగింది నిర్మల.

"మీ రిచ్చారుకదూ డబ్బు. నేనేంచెయ్యాలి. కొన్నాను. ఈ చీరలు. మీలో ఒకదాన్నిగా కలసి బ్రతుకుతూన్నప్పుడు

*With best compliments from*

**BIOLOGICAL EVANS LIMITED**

Regd. Office & Factory :

18/1 & 3, Azamabad, Hyderabad-500020.

మీరు పరాయివారా! మీరు నన్ను అభిమానిస్తున్నప్పుడు నేను ఎందుకు అభిమానిస్తున్నానని ప్రశ్నిందుకు!"

''బలేమాటకారివిసుమా! నువ్వే నయం. నా కోసం చీరలు తెచ్చావు. ఎనిమిదేళ్ళయింది కాపరానికొచ్చి. ఒక్క జాకెట్టు గుడ్డకూడా ఆయన చేత్తో తెచ్చిన పాపాన్నపోలేదు. నేను షాపుకెళ్ళి తెచ్చుకోవడమే."

సత్యవతిని మెచ్చుకుంటూ "తాతా! అమ్మమ్మా! చిన్నమ్మా పెద్దమ్మలా! మామయ్యలా! ఎవరున్నారు నా పిల్లలకు బట్టలూ మిఠాయిలూ తెచ్చేవారు?'' అంటూ కంటతడిపెట్టింది నిర్మల, రఘుని చూస్తూ.

''అరె మీరు మిఠాయంటే జ్ఞాపకమొచ్చింది. మాచెల్లెలు చేసిఇచ్చింది.'' అంటూ గులాబ్ జామ్‌లసీసాతెరచి, "ఒక్కటి తినండమ్మా"అని నిర్మల చేతిలో ఒకటి ఉంచి, ఓ ప్లేట్లో రఘుకీ, ఓ ప్లేట్లో మూర్తికీ కొన్ని పెట్టి ఇచ్చింది సత్యవతి.

"నీ చెల్లెలుకి తెలుసేమిటి సత్యవతీ, నాకు గులాబ్ జామ్‌లు ఇష్టమనీ" హాస్యంగా నవ్వుతూ అన్నాడు మూర్తి.

"ఉష్. అతిచొరవ. నొచ్చుకుంటుంది." అంది సత్యవతి నెమ్మదిగా.

ఆ రాత్రి అతనికి వడ్డనచేస్తూ నెమ్మదిగా నిర్మల వినకుండా తనకూ, రాధకూ మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పింది మూర్తికి సత్యవతి.

"పోనీ నీ నిర్ణయంలో ఏమయినా మార్పు వచ్చిందా?" అడిగాడు మూర్తి.

"సాధారణంగా నిర్ణయాలు తీసుకోను. తీసుకున్నానంటే మరి వాటికి తిరుగుండదు. చెప్పకపోతే మీరు అర్ధరాత్రి జబ్బుతట్టి లేపుతారని," అంటూ నవ్వేసింది సత్యవతి.

"మొండితనం, మూర్ఖం అంటారు అలాటి నిర్ణయాలని తెలుసా."

* * *

నిర్మలకు కాళ్ళుపట్టే సత్యవతివైపు కోపంగా, అసహనంగా చూశాడు మూర్తి.

ఏదో పనిఉన్నట్టు చివాలున వెనుదిరిగి రెండవగదిలో కెళ్ళిపోతూ "సత్యవతీ" కరకుగా పిల్చాడు.

గబగబా వచ్చింది సత్యవతి. 'ఏం కావాలి? ఎందుకు పిల్చారు?' అంటూ.

"కాళ్ళు పిసుకుతావని..." పెదవులు బిగబట్టి చిరాగ్గా అన్నాడు మూర్తి.

"అలానే. మీరు కోరితే కాదంటానా!" నవ్వింది సత్యవతి.


*WITH COMPLIMENTS :*

**KAMINENI WIRES**

5-9-261, KING KOTHI ROAD

**HYDERABAD-500001.**




మా ఇతర ఔషధములు :

గర్భరక్షక : గర్భపోషణకు, సుఖప్రసవమునకు

మాదీఫల రసాయనం : వేవిళ్ళకు, మలబద్ధకమునకు

సౌభాగ్య శొంఠి : ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి

"నీకు సిగ్గూ, అభిమానం లేవు!...తాను పట్టమంటుందీ, అన్నం పెడుతున్నామనే అహంతో. ఎవరికాళ్ళు పట్ట వచ్చునో, ఎవరివి పట్టకూడదో ఆమాత్రం జ్ఞానంలేదూ!"

"ప్చ్. పాపం నాలుగు రోజులైంది జ్వరంతో వేగి పోతూంది. కాళ్ళూ, వళ్ళూ నొప్పులు. తనకి ఎవరున్నారు చెప్పండి! భర్తంటె, ఆమె ఆరోగ్యంగా ఉంటె పక్కన చేరు తాడు, కాని..."

"సత్యవతీ ..."

"ఏం? నిజం వినడానికి చేదుగా ఉందా...? తనకి తలి దండ్రులా, తోబుట్టువులా? ఎవరున్నారు చెప్పండి, ఇలాటి కష్టకాలంలో సేవచెయ్యడానికి."

"నువ్వొచ్చావుగా. అన్నీ నేనని..."

"పోనీ అలానే. ఒక్కసారి ఆమెను ఆప్యాయతగా స్పృశించి, ఎలాఉందని ప్రశ్నించలేదు...పైగా ఆమె మూలుగుతూందని – పక్క గదిలోకి పక్కమార్చు కున్నారు..."

"హద్దులు మీరిపోతున్నావు...మా వ్యక్తిగత విష యాల్లో జోక్యం పెట్టుకోకు...నేనూ చాలాసార్లు జ్వరంలో పడ్డాను. ఆమె నా కన్నా నిర్లక్ష్యంగా ప్రవర్తించింది.ఒక్క సారి నా తలన్నా పట్టెరుగదు."

"అయితే ఇప్పుడు బదులు తీర్చుకుంటున్నారన్న మాట."

"బదులు తీర్చుకోవాలనుకుంటె డాక్టరుకి చూపించ కుండా ఉండాల్సింది. ఇంతకీ ఎలా ఉంది జ్వరం?"

"నార్మలుకి రాలేదు. మామూలుగా ఉంది...ఓ సారి వెళ్లి అడగరాదూ!"

"మధ్య నీ వత్తిడి ఏమిటి?"

"ఆమెను ఒక్కసారి చూసి ఆప్యాయతగా పలకరించాలి మీరు."

"నయం. కాళ్ళు పట్టమన్నావుకాదు," అని గొణుగుతూ. నిర్మల గదిలోకెళ్ళాడు మూర్తి.

నడుముకి చేతులాన్చుకు నిల్చుని "నిర్మలా ఎలావుంది? ఏమన్నా తగ్గినట్టుందా! నిన్నా మొన్నటికన్నా?" అడిగాడు మూర్తి. బరువుగా కనురెప్పలెత్తి అతనివైపు చూస్తూ, "సత్యవతిని పిలవండి" అంది నిర్మల.

"నీ దగ్గర తాను కాళ్ళుపడుతూ ఇరవైనాలుగు గంటలూ కూర్చుంటే ఇహ ఇంట్లో పనులూ, మాకు తిళ్లూ తిప్పలూ అక్కర్లేదన్నమాట." కరుగ్గా ధ్వనించిందతని గొంతు.

నిర్మల కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మళ్ళీ కళ్ళు మూసుకుని వత్తిగిలి పడుకుంది.

ఆమె చెంప స్పృశించి చూసి, "పిల్లల్ని దూరంగా ఉంచు. టైఫాయిడేమో" అన్నాడు మూర్తి.

"తగ్గదంటారా? అయితే ఇది అంటుజ్వరమా ? చచ్చిపోతానా?" చివాలున అతనివైపు తిరిగి వణికే గొంతుతో ప్రశ్నించింది నిర్మల.

జ్వర తీవ్రతతో కంది జేవురించిన వదనం, వణికే పెదవులూ, తడిగాఉన్న కళ్లూ చూసిన మూర్తి చలించాడు. "ఛ. అదికాదు నిర్మలా ! వాళ్ళకేం తెలియదు. బెంగపడతారు. అందుకని మందు మార్చమని డాక్టరుకి చెబుతాను. నిన్న వచ్చిచూశారా ఆయన?" అడిగాడు.

ఆ...టైఫాయిడయితే ఇంత తొందరగా తగ్గదుగా!

"ఫర్వాలేదు. తగ్గిపోతుంది. ఈ రోజుల్లో టైఫాయిడుకి భయపడవలసిన అవసరంలేదు. సత్యవతిని పిలవమన్నావా! చెబుతానుండు" అని ఇవతలి కొచ్చేశాడు మూర్తి.

"సత్యవతీ, నేను చచ్చిపోతాను సత్యవతీ. పిల్లల్ని చూస్తావుకదూ! నువ్వీ ఇంట్లోంచి తరిమినా వెళ్ళిపోకూడదు." నిర్మలగొంతు.

"అలా అనొద్దు. మీ పిల్లల్ని మీరే చూసుకుంటారు. మరేం ఫర్వాలేదు, తగ్గిపోతుంది జ్వరం." సత్యవతి గొంతు.

"అనునయవాక్యాలు కట్టిపెట్టుగాని, పిల్లల్ని పెద్దవాళ్ళయేదాకా కనిపెట్టుకునిఉండు. మా ఆయనకి కావాల్సిందెప్పుడూ అందంగా ఆరోగ్యంగా ఉండే ఆడది. ఆయన నేను పోయిన వెంటనే అలాటిదాన్ని పెళ్ళిచేసుకుంటాడు."

"అబ్బబ్బ. అలాటిమాటలనకండమ్మా."

"జరగబోయేది చెబుతున్నాను సత్యవతీ. ఆయన మనస్తత్వం నాకు తెలుసు. ఇప్పుడాయనకు పిల్లలంటే ప్రేమే అనుకో. కాని తల్లిపోయాక తండ్రి పినతండ్రయిపోతాడట. ఆయనకు నేను మొదటిభార్యను కాను."

మౌనంగా ఉండిపోయిందీసారి సత్యవతి.

"ఏమలాఉండిపోయావు ! నిజమే సత్యవతీ, 'మొదటిభార్య బ్రతికేఉంది. ప్చ్, పాపం, ఆమె తండ్రి ఈయనకు చదువు చెప్పించారట. అయితే ఆమె జబ్బువడి అనాకారి అయితే అమెదగ్గర రెండవపెళ్ళికి వ్రతంపుచ్చుకుని నన్ను పెళ్ళిచేసుకున్నారు. ఇప్పుడనిపిస్తూంటుంది. ఆమెను తిట్టి కొట్టి హింసించీ ఆ పత్రం నేకరించి ఉంటారని,"

కాదు ఆమె వ్రాసిచ్చింది అనబోయి ఆగిపోయి "ఇప్పుడవన్నీ ఎందుకమ్మా ! పాపం ఆయనా స్థిమితంగాలేరు.


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా ? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స, ఎంత మాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి—శస్త్రచికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది—విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు సామర్ధ్యంగా గుణాన్ని కలిగించి రక్త శంకలను ముకుళింపజేసి ఆరోగ్యకరమైన టిష్యూ రంధ్రాల ప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూలశంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే ముమ్ముందు శస్త్ర చికిత్స అవసర ముండదు!

హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

హెడన్‌సా
మూలశంకకు




Bensons..2144 R TEL

సరిగ్గా భోజనంచెయ్యడంలేదు. రాత్రి నిద్రపోవడంలేద్దు." అంది సత్యవతి.

"నిజమా ! నాకోసం బాధపడుతున్నారా...!" ఆమె కానమయంలో సత్యవతి ఆత్మీయురాలిగా కనిపిస్తూంది.

"నిజమేనమ్మా ! రాత్రి రెండుమూడుసార్లు వచ్చి మిమ్మల్ని చూస్తున్నారు. బాబూ, పాపా ఆయనదగ్గరే నిద్ర పోతున్నారు."

ఈసారి వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది నిర్మల.

చప్పున గదిలోకొస్తూ, "మతులు పోయాయేమిటీ ? ఏమిటా ఏడుపులు ?" అన్నాడు మూర్తి.

గబ గబా కళ్ళుతుడుచుకుంది సత్యవతి.

"ఎలాఉంది నిర్మలా ? డాక్టరుని రమ్మని ఫోన్ చెయ్యనా !" అన్నాడామె తల అప్యాయతగా నిమురుతూ మూర్తి.

"పిల్లల్ని బాగా చూస్తారుకదూ !" అతని చేతిని పట్టుకుంటూ వణికేగొంతుతో అడిగింది నిర్మల.

"ఛ ఛ. చాదస్తపుమాటలు. నువ్వే చూస్తావు నన్నూ, పిల్లల్నీ.ఉండు డాక్టరికి చెబుతాను. నీ కెందుకిలాటి అధైర్యం కలుగుతుందో !" అంటూనే ఆఫీస్ రూమ్‌లో ఉన్న ఫోన్ దగ్గరకు నడిచాడు మూర్తి.

డాక్టరు వచ్చి నిర్మలకి ఇంజక్షన్‌చేసి కొన్ని టాబిలెట్సిచ్చి, ప్రతిగంటకీ వెయ్యమనిచెప్పి వెళ్ళిపోయాడు.

ఆ రోజు మూర్తీ, సత్యవతీ భోజనంచెయ్యలేదు. విషాదంగా గంభీరంగా మారిపోయింది వాతావరణం.

ఆ రాత్రి స్పృహకోల్పోయింది నిర్మల. సత్యవతీ, మూర్తీ చెరొక పక్కా కూర్చున్నారు. కొంచెంసేపు గడిచాక విపరీతంగా తెలివిలేనిమాటలు మాట్లాడటం మొదలు పెట్టింది నిర్మల.

మళ్ళీ డాక్టరు వచ్చాడు.

ఆ రాత్రి ఎవరికీ నిదర్లులేవు. తెల్లవారి కొంచెం నయమనిపించింది నిర్మలకి.

ఆఫీస్‌గదిలోకెళ్ళి యీజీఛైర్లో పడుకుని బరువుగా కళ్ళు మూసుకున్నాడు మూర్తి.

అతనిగదిలోకి కాఫీగ్లాస్‌తో ప్రవేశించింది సత్యవతి.

కాఫీ తీసుకుని ఆమెచేతినిపట్టి మృదువుగా నొక్కుతూ, "సత్యవతీ నీకు చాలాఋణపడిపోయాం. ఎలా తీర్చుకోవాలో బోధపడటంలేదు." అన్నాడు మూర్తి.

అతనిచేతిని విడిపించుకుంటూ "ఆలోచించి చెబుతాను. కాని నే చెప్పినట్టూ చెయ్యండి." అని వెళ్ళిపోయింది సత్యవతి.

* * *


దీపావళి శుభాకాంక్షలతో

చారీ అండ్ కంపెనీ

ప్రింటర్స్ అండ్ బైండర్స్

103, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాదు-3

ఫోన్ : 75570

జ్వరంవదిలి క్రమంగా కోలుకుంది నిర్మల. సత్య వతంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది ఆమెకు.

మళ్ళీ ఓసారి తనవాళ్ళను చూసివస్తానని ప్రయాణ మైంది సత్యవతి. కాని నిర్మల వప్పలేదు. ఓసారి వాళ్ళనే మన ఇంటికి రమ్మని వ్రాయి అంది నిర్మల. తన అనారోగ్య కారణంగా, చాలా రోజులతర్వాత రాత్రి తొమ్మిది గంటల వేళ మళ్ళీ సత్యవతితో ఏకాంతంగా మాట్లాడాడు మూర్తి. "సత్యవతీ నీ నిర్ణయం మార్చుకో. నిర్మలకు నీమీద మంచి అభిప్రాయముంది. నువ్వు నా మొదటి భార్యవని తెలిసినా నీతో నేను సంబంధం పెట్టుకున్నా నిన్నింట్లోంచి పొమ్మనదు. ఆలోచించు. నువ్వు కావాలని కోరుకుంటున్న నన్ను నువ్విలా తిరస్కరించడంన్యాయమేమో? ఆలోచించు. ముసలివాళ్ళమయిపోతున్నాం. కాలం యౌవనం జారి పోతూంది." అన్నాడు నెమ్మదిగా ఆమె మంచందగ్గర కుర్చీలో కూర్చుంటూ.

"నా భర్తను నేను మరొకస్త్రీకి పంచాల్సి వస్తుందని ఏనాడూ అనుకోలేదు. నేను కోరుకున్నది నన్ను ఒక్కత్తెనే ప్రేమించే భర్త. నన్నొక్కదాన్నే కోరుకునే భర్త. భార్యగా నన్నొకత్తెనె చూసే వ్యక్తి. అలాటి ఆశ తారుమారయింది ఏనాడో. మరొక స్త్రీ మీ జీవితంలో ప్రవేశించడానికి ఎప్పు డవకాశమిచ్చానో, అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాను ఈ జీవితం ఇలానే రాలిపోవాలని. నిర్మలేకాదు, నా భర్త అనే అతను మరొకస్త్రీతో సంబంధం పెట్టుకోవడం నేను సహించ లేను. "మీరు నా భర్తనే భావన నా గుండెల్లో మంటలు రేపు తుంది. అయితే మిమ్మల్నీ, నిర్మల్నీ, పిల్లలనీ ఎందుకు ప్రేమిస్తున్నానో, మీరంతా బాగుండాలనీ' మీ అభివృద్ధినీ ఎందుకు కోరుకుంటున్నానో అది నాకే తెలియదు. ప్లీజ్, మళ్ళీ మీకిలాటి ఉద్దేశ్యమెందుకువచ్చిందో మార్చుకోండి. నన్నొక తోబుట్టువుగా ప్రేమించండి."

"సత్యవతీ! నిర్మల ఆరోగ్యం పాడయింది. అది నీకు తెలుసా ?

"అవును. నా నిర్ణయం మార్చుకోలేను."

"ఛీ...ఛీ...నీది మూర్ఖం. ఇప్పుడు నిన్ను బలవంతాన అనుభవించినా నువ్వేంచెయ్యలేవు."

"ఎందుకు చెయ్యలేను. సుందర్రావు బైటికి పోలేదూ. అలాకాక మీ కోరికే తీరితే ఈ సత్యవతి శవాన్నే చూస్తారు తిరిగి."

"నీకెందుకింత పట్టుదల. ఆ నాడు అలా తిరస్కరించా నని కసా, ఇలా తీర్చుకుంటున్నావు."


Phone : 74386
Resi : 74383

Grams : 'FANCY PAPER'
Secunderabad

*With best Compliments from :*

# GOLI ESWARAIAH

Dealers : Paper, Boards and Printing Materials.
General Bazar, SECUNDERABAD-A. P.

"కావచ్చు......"

"సత్యవతీ. ఒక్కోసారి మరీ ఇలా మాట్లాడతావు."

"అవసరమైతే కఠినంగా మాట్లాడక తప్పదు. వెళ్ళిపొండి దయచేసి. ఈ సత్యవతి మీ కళ్ళెదుట బ్రతికుండాలనుకుంటే మరొకసారి ఇలాటి ప్రయత్నం చెయ్యకండి."

"అంతేనా...!" అతను గతాన్ని విస్మరించాడు.

"అంతే." ఆమె గతాన్ని మరవదలుచుకోలేదు.

వెళ్ళిపోయాడు మూర్తి విసురుగా.

కాని తర్వాత సత్యవతిపట్ల ముభావంగా ఉంటూవచ్చాడు. తాను ఇంట్లో వారంలో ఉండే ఒకటి రెండురోజులూ తనకేపనికావాల్సినా నిర్మలని పిలిచేవాడు. నిర్మలనే తనకి అన్నంపెట్టమని బలవంతంచేశాడు. తప్పలేదు నిర్మలకి.

మళ్ళీ పదిరోజులతర్వాత వచ్చిన మూర్తి, "అడుగడుగునా ఇలాతిరగడం తనకి ఇబ్బందిగా ఉందని, ఆ ఊళ్ళోనే కాపరంపెట్టేద్దామనీ" అన్నాడు భార్యతో.

"అలానే, ఇల్లంతా అద్దెకిచ్చేద్దాం.సత్యవతికి చెబుతాను." అంది నిర్మల.

"తనని మనతో తీసుకెళ్ళొద్దు."

"బాగుందండీ పాపం. నాకు తెలియక అడుగుతాను సత్యవతంటే అలా అసహ్యించుకుంటున్నారెందుకీ మధ్య. పాపం తానేంచేసింది?"

"పాతికో పరకో పంపిద్దాం. ఇక్కడ ఇల్లు కనిపెట్టుకొని ఉండమను. అద్దెలవాళ్ళు ఇల్లు పాడుచెయ్యకుండా చూస్తుందని, అంతేకాని ఆమెమీద నాకు అసహ్యమెందుకూ!"

"పిల్లలు తనదగ్గర బాగా అలవాటయ్యారు."

"అయితే వాళ్ళనీ వదిలెయ్ ఇక్కడ."

"మీరు పిల్లల్ని వదిలి ఉండలేకేకదా అక్కడికి కాపురం మారుస్త."

"ఎలా అయినా సత్యవతి మనదగ్గర ఉండటానికి వీల్లేదు."

"సర్లెండి ఆలోచిద్దాం" అనేసింది నిర్మల.

అతనున్న రెండురోజులూ సత్యవతిని చూడాలనీ, ఆమెను కసిగా ఏమేమో అనాలనీ అనుకున్నాడు మూర్తి.

కాని సత్యవతి అతనికి కనుపించకుండానే మసులుకుంది. రాత్రి తలుపు గడియపెట్టుకు పడుకుంది.

తర్వాత ఇరవైరోజులదాకా రాలేకపోయాడు మూర్తి, క్యాంపులు తిరగడంవల్ల.


**అమృతాంజన్ గ్రైప్‌మిక్స్‌చర్**

పాప ఆరోగ్యానికి,
సంతోషానికి దివ్యామృతం.

అజీర్ణం, వాయువు, కలతనిద్ర, వాంతులు, విరేచనాలవంటి బాధలు వెంటనే తగ్గిపోతాయి.

ఆకలి, జీర్ణశక్తి బాగా ఉంటాయి.
పాపాయి ఆరోగ్యం బాగుపడుతుంది.






అమృతాంజన్ లిమిటెడ్

FDS AG 1660 TELB

నిర్మల్ని చూసి "ఏమలా ఉన్నావ్ ? ఏం జరిగింది" ఆత్రుతగా ప్రశ్నించాడు మూర్తి.

"సత్యవతి పోయిందండీ!" అంది నిర్మల.

స్థాణువులా నిల్చుండిపోయాడు మూర్తి. ఆమె ఎలా పోయిందని ప్రశ్నించడానికి కూడా అతని పెదవులు విడ లేదు.

తానే చెప్పుకుపోతూంది నిర్మల "మామూలుగా జ్వరం వచ్చింది. రెండురోజులు అలానే వంటచేసింది. మూడవ రోజు లేవలేకపోయింది. డాక్టరుకి చెప్పాలనుకున్నాను. తర్వాత మశూచి అని అనుమానం వచ్చి, గవర్నమెంటు హాస్పిటల్లో జాయినుచేయించాను. పిల్లలున్న ఇల్లు కదా అని."

"ఎప్పుడు పోయింది ? నాకు తెలియపరచలేదేం ?" తీవ్రంగా ధ్వనించింది అతని గొంతు.

"మీరు క్యాంపు వెళ్తున్నానని వ్రాశారుగా. అయినా ఆ అడ్రసుకి వ్రాసిన ఉత్తరంలో సత్యవతి హాస్పిటల్లో ఉందనీ అందునుంచి పాత వంటవాడిని పెట్టాననీ వ్రాశాను. ఇవ్వాళ ఉదయం పోయిందట."

"నువ్వెప్పుడన్నా హాస్పిటలుకి వెళ్ళి చూసేదానవా? ఆమె చెల్లెలూ వదినా ఉన్నారు. వారికీ సంగతి వ్రాశావా? నాకు నీ ఉత్తరం అందలేదు."

"బాగుంది ఎందుకలా వణికిపోతున్నారు ? ఎందుకంత కోపం ! ప్రతిరోజూ చూసిరావడానికి నాకెక్కడ తీరిక. అయినా అంటువ్యాధాయె."

నిర్మల చెంప చెళ్లుమంది. "అంటువ్యాధని హాస్పిటల్లో పారేశావ్? ఆమెను చూసి మాట్లాడితే అంటుకుంటుందని మానేశావ్. రాస్కెల్. హాస్పిటల్‌వాళ్ళు సత్యవతిని ఖాతరు చేస్తారా? నాకో చిన్న కబురు, చిన్న మాట సత్యవతి ఇలా ఉందనితెలియపరిస్తే వచ్చేవాడినే...ఇంట్లోనే ఉంచేవాడిని... ఉదయం పోతే కనీసం శవమన్నా ఉందా నేను ఆఖరిసారి చూసేందుకు? అదీ తగలబెట్టించేవా ?" అన్నాడు.

"ఆ. అన్నీ అయిపోయాయి. మీరు చూసేందు కేమీ లేదు" రోషంగా జవాబు చెప్పింది నిర్మల.

"ఎంత పనిచేశావు నిర్మలా!..." అతని గొంతు పూడి పోయింది. గబగబా పక్కగదిలోకి తప్పుకున్నాడు. కిటికీ తలుపులతోసహా అన్ని తలుపులూ వేసేసుకున్నాడు. జాలీ, పశ్చాత్తాపం, బాధా. హృదయం ద్రవించి పోతూంది. మనస్సు విలవిలలాడిపోతుంది. కళ్ళు నిర్విరామంగా వర్షిస్తున్నాయి. జుట్టు గుప్పిటతో పీక్కుంటూ కుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

'మీరు చూసేందుకేమీలేదు.' నిర్మల గొంతు అతని



చెవుల్లో గింగురుమంటూంది. తనకు కనిపించకూడదన్నట్లు తాను క్రితంసారి వచ్చినప్పుడు కనుపించడం మానేసింది. తను కూడా పౌరుషంగా ఆమెను పిలిచి మాట్లాడటం మానేశాడు. నిర్మల 'నా ఆరోగ్యం బాగులేదు. మీ ఇష్టమైన విధంగా మీరుండొచ్చు. నేను అడ్డురాను' అని చెప్పినరోజు సత్యవతిని మళ్ళీ అడిగాడు ఆమె నిర్ణయం మార్చుకోమని. మూర్ఖంగా తన పట్టుదల విడువని సత్యవతిని తన కనుగుణంగా మార్చుకోవడానికి మార్గాలు అన్వేషిస్తూ ఆమెపట్ల నిర్లక్ష్యంగా ముఃభావంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. ఆమె తనకై తాను తనను బ్రతిమిలాడుతుందనీ, ఆమె నిర్ణయం మార్చుకుంటుందని.

ఆనాడు నిర్మలకు నిజంచెప్పి, తాను సత్యవతికి భార్యగా స్థానం ఇవ్వొచ్చనీ, అందంగా ఆకర్షణీయంగా ఉండే సత్యవతితో తన జీవితం ఎలాఎలానో మలుచుకున్నాడు ఊహాపథంలో. ఆనాడు తనను నిందించిన రాధకు తన మంచితనం, వ్యక్తిత్వం ఋజువు చెయ్యాలనుకున్నాడు. రాధతో, పార్వతితో, రాధ భర్తతో, అందరితో సత్యవతిని తీసుకువెళ్ళి వారితో ఒక వ్యక్తిగా ఒక్కసారి కలిసిపోవాలనుకున్నాడు. వారందర్నీ తన ఇంటికి తీసుకురావాలనీ, అందరితో నవ్వుతూ నిర్మల కలసిపోవాలనీ ఎన్నెన్నో కలలు కన్నాడు. అవన్నీ పగటి కలలుగా ఎండమావులుగా తనను వెక్కిరిస్తూ వెళ్ళిపోయింది సత్యవతి.

పద్దెనిమిదేళ్ళ పడుచుగా సత్యవతి తన దగ్గర ఏడుస్తూ ఓనాడు 'వద్దు మూర్తీ నీ మనస్సులో నేనంటే అయిష్టతకు చోటివ్వకు. జీవితాంతం ఓచోట కలిసి బ్రతికేవారం. మన బ్రతుకులు నరకం చెయ్యకు' అని కోరింది .ఆమెను తిరస్కరించిన నా బ్రతుకు నరకమే కావాలనుకుంది కాబోలు.

మార్కుల లిస్టు చూపించమని పందెంకాసి జెల్లకొట్టి పారిపోయింది సత్యవతి ఆనాడు. ఇప్పుడు ఇన్ని సంవత్సరాలూ నా ఇంట్లో, నా సమక్షంలో చనువుగా ఆత్మీయంగా తిరిగి నా మనస్సు తనవైపు తిప్పుకుని, తనవైపు నన్ను పూర్తిగా ఆకర్షించుకొని మా అందరిలో ఏవో మమతలురేపి అందరం ఏమరుపాటున ఉన్నవేళ మాయమైపోయింది గతం కలగా మరచిపొమ్మని కాదు.'

"ఏమండీ!" తలుపు తట్టి పిలుస్తూంది నిర్మల.

అతను విన్పించుకోవటం లేదు. ఎప్పుడో దూరమైపోయిన సత్యవతి, తాను విస్మరించిన సత్యవతి. తాను దూరం చేసుకుని ఆమెను మరచిపోయిన తర్వాత మళ్ళీ తన ఇంటికి ఎందుకు రావాలి! అస్సలామె అన్న ఎందుకు పోవాలి. అటువంటి విషమ సమస్యలెందుకు రావాలి. వస్తే,

*With best compliments from :*

**KWALITY ICE CREAM**

(Unit Telangana Chemical Industries)

NOW UNDER NEW MANAGEMENT

***For all Trade enquiries contact :***

FACTORY :
B-3, Co-operative Industrial Estate
Balanagar,
HYDERABAD-500039.
Phones : 39111 & 39655

OFFICE :
Sri K. Nagabhushana Rao,
37-L. B. Stadium,
HYDERABAD-500001.
Phones : 34322 & 35342

తనను వెతుక్కుంటూ వచ్చి తన దగ్గరే ఆశ్రయమివ్వమని రాధ ఎందుకు కోరాలి. తాను ఆమెను తన ఇంటికి ఎందుకు తెచ్చుకున్నాడు! ఎందుకిలా జరిగింది అంతా! తనహృదయాన్నాక్రమించుకొని తన కేవో ఆశలు చూపించి. తన నాకర్షించి తన కందకుండా తన నెందుకిలా మోసంచేసి ఈ ప్రపంచాన్ని దాటిపోయింది సత్యవతి!

"తలుపు తియ్యండి!" తల తలుపుకి బాదుకొంటున్న శబ్దం విని తృళ్ళిపడ్డట్టయిన మూర్తి చివాలున తలుపు వైపు నడిచి తలుపులు తెరిచాడు.

"నేనే సత్యవతికోసం ఏడుస్తున్నాననీ, బాధపడుతున్నాననీ అనుకున్నాను. సత్యవతి పోవడం మిమ్మల్నింతగా కదిలిస్తుందనుకోలేదు. ఆమె మన కుటుంబానికి చాలా సేవ చేసింది." గొంతు పూడిపోగా మౌనంగా ఉండిపోయింది నిర్మల.

మెరపులా ఏదో ఆలోచనతట్టిన మూర్తి "నిజంగా సత్యవతి మశూచి మూలంగానే చచ్చిపోయిందా! లేక ఆత్మహత్య చేసుకుందా! ఆమె ఎలా చచ్చిపోయింది? అస్సలు నిజంగా చచ్చిపోయిందా! లేదు. అలా జరగదు. ఇదంతా కలేమో! కలని వాస్తవంగా భావించి ఏడుస్తున్నానేమో? నిర్మలా, సత్యవతి చచ్చిపోలేదని చెప్పు. అలా చెప్పు నిర్మలా!"

నిర్మల భుజాలుపట్టి కుదుపుతూ కన్నీళ్ళు చెంపలమీంచి జారిపోతూంటే పిచ్చివాడిలా చూస్తూ అడిగాడు మూర్తి.

"నాకేమిటో కంగారుగా ఉంది. అస్సలు మీరెందుకింతలా ఏడుస్తున్నారు? ఆమె మీకేంకావాలి? కొంతకాలం మనింట్లో ఉండి మన నభిమానించి మనకి వండిపెట్టింది మనలో ఒక వ్యక్తిగా మెసిలింది. అంతమాత్రాన ఇంతలా కృంగిపోవాలా! ఆమె నిజంగా చచ్చిపోయింది."

"అలా చెప్పకు నిర్మలా. సత్యవతి చచ్చిపోయిందని ఒక్కసారిగా చెప్తే భరించలేకుండా ఉన్నాను. ఈ శోకానికీ గుండెబరువుకీ తట్టుకోలేను. నాకీ జీవిత మక్కరలేదని పిస్తుంది. బలవంతాన చచ్చిపోవాలనిపిస్తుంది."

"బాగుంది మతిపోయిందా ఏం? నేను మంచాన పడి చావసిద్ధమైన రోజునకూడా మీరిలా దిగజారిపోలేదేమో! ఆ సత్యవతంటె ఇంత ప్రేమా మీకు. నాకు తెలియదే! సత్యవతి బ్రతికి ఉండగా...."

"అలా...నా సత్యవతి బ్రతికిఉందని చెప్పు నిర్మలా. ఆమె మాట పూర్తికాకుండా అడ్డువస్తూ ఆమె చేతులు రెండూ పట్టుకుంటూ అన్నాడు మూర్తి.

"మీ సత్యవతా!" తెల్లబోయింది నిర్మల.

"అవును నా సత్యవతి, నా భార్య. కాని భర్తగా ఆమెను


*Hearty Diwali Greetings*

*from*

**VENKATESH PAPER MART**

WHOLESALE DEALERS IN PAPER & BOARDS IN ALL VARIETIES ON MOST COMPETETIVE RATES

**4-6-546, ESAMIAH BAZAR,**

**HYDERABAD-500027.**

Phone : 51828

ఒక్కరోజన్నా సంతోషపెట్టి ఉంటే, ఆమెకు న్యాయం చేకూర్చి ఉంటే ఇంత బాధపడేవాడ్ని కానేమో! ఆమె చదువుకోలేదనీ, ఆమె అనాకారి అయిందనీ నేను ఆమెను కాదంటే ఆమె నాకు అక్కరలేదని పిచ్చిగా మామయ్య దగ్గర వాగితే, ఆనాడు నా సత్యవతి, నాకోసం తనజీవితమే త్యాగంచేసింది. ఎవ్వరికీ తెలియకుండా నాకు కబురుచేసి సంతకం చేసిన తెల్లకాయితం ఇచ్చి, మూర్తీ! పైన నీ ఇష్ట మొచ్చినవిధంగా వ్రాసుకో, అంది. మళ్ళీ పెళ్ళి చేసుకో మంది... నన్ను ఏమీ కోరలేదు సత్యవతి. తన నాదుకుని పోషించే వారెవరూ లేనప్పుడు మన ఇంటికి వచ్చింది. ఇక్కడ తానెవరో చెప్పకూడదనీ, తనను తాకకూడదనీ శాసించింది- ఏనాటికైనా తన అభిప్రాయం మారుతుందని, ఆమె నన్ను అర్థంచేసుకు నాకోరిక మన్నిస్తుందనీ ఆశించాను నిర్మలా!"

"అబద్ధం. మీకంత పశ్చాత్తాపమూ, కృతజ్ఞతా ఉంటే ఆమెనా వంటమనిషిగా గుర్తిస్తారు! ఆమెచేత వంట పనులు చేయిస్తారా? పాపం, మిమ్మల్నీ, మీ వ్యక్తిత్వాన్నీ, మీ స్వార్థాన్నీ తెలుసుకుంది కాబట్టి అర్ధంచేసుకుంది కనుకనే ఇన్ని సంవత్సరాలూ వంటమనిషిగానే ఉండిపోయింది. ఆమెమీద మీకు కనీసం సానుభూతీ, జాలి ఉన్నా, ఏనాడో ఆమె నా మొదటి భార్య అని నాకు చెప్పిఉండేవారు. అలా చెప్పిఉంటే ఆమెకు ఇంట్లో ఇవ్వాల్సిన గౌరవం నేను ఇచ్చే దాన్ని. ఆమెచేత దాసీపనులు చేయించేదాన్ని కాదు. ఆమె చేసే సేవలందుకునే దానను కాదు. ఎంతపనిచేశారు? ఎంత స్వార్థం మీకు."

"నిర్మలా! నన్ను నిందిస్తున్నావా?" ఆశ్చర్యంగా చూస్తున్నాడు నిర్మలవైపు మూర్తి.

"మిమ్మల్నికాక ఎవర్ని నిందించాలి? సత్యవతినా! ఎంత మంచిది సత్యవతి! ఆమెకు నేనెవరో తెలిసీ నన్నెలా ప్రేమించగలిగింది! ఎంత ఉన్నత హృదయం ఆమెది! నా పిల్లల్ని తన పిల్లలుగా ప్రేమించింది. పిల్లలు సత్యవతికోసం బెంగ పడిపోతారేమో! భయంగాఉంది. ఛి...ఛీ... చదువు చదవగానే పెద్దఉద్యోగంచేసి నలుగురుచేత నమస్కారాలు పెట్టించుకున్నంతమాత్రాన మనిషి మంచివాడయిపోతాడా? ఇలా మీరు సత్యవతికోసం తలబాదుకు ఏడుస్తూంట్టే చూడటానికి నాకు అసహ్యంగా ఉంది. నా


Phone : 6 6 2 1 1 9

Grams : 'RANGARAJ'
Bombay, Andheri.

*With the best compliments from :*

ORGANIC COATINGS PRIVATE LIMITED
91, Amrut Nagar, Kurla Road, Chakala,
Andheri (East) BOMBAY-69 AS

*Manufacturers of :*
Printing Inks, Artists' Colours and allied Products.

సత్యవతి అనటానికి మీకు నోరెలావచ్చింది. ఆమె కెలాటి భర్త మీరు ?" నిరసనగా నవ్వింది నిర్మల.

తలవంచాడు మూర్తి.

"ఆమె మీ మొదటి భార్య అని మీరు చెప్పిఉంటే, ఆమెకు ఈ ఇంట్లో అలాంటి స్థానం ఇవ్వనిచ్చేదాననా? ఆమె ఆడది కాదన్నమాటా అబద్ధమే. నేనే తెలుసుకున్నాను. ఆమె ఏదో భయంతో తన స్థానం బలపరుచుకోవాలని చెప్పిన మాట అది. కొన్నాళ్ళ తర్వాత అడిగాను కూడా. నవ్వేసి, 'క్షమించదమ్మా,' అనేసింది. ఆమె శాశ్వతంగా ప్రపంచాన్ని దాటి పోయేవరకూ ఆమెనూ, నన్నూ, పిల్లల్నీ వంచించింది మీరు."

"నిర్మలా !"

"ఏం? ఎప్పుడూ సత్యవతి ఇలా ఎదురు తిరిగి వాదించి ఉండదు. అలా వాదించి ఉంటే మీరిలా ఆమెకు అన్యాయం చెయ్యలేక పోయేవారు."

"ఇష్టమొచ్చినట్టు వాగకు. ఆమె కేమీ అన్యాయం చెయ్యలేదు నేను."

"ఛి. ఛీ. మాట్లాడకండి. ఆమెకు చేసినదంతా అన్యాయమే. ఇంజనీరు నవాలనే కోరికతో ఆ డబ్బుకోసం ఆమె మెడలో తాళికట్టారు. ఆమె దగ్గర సంతోషంగా కాయితం తీసుకు మళ్ళీ పెళ్ళికి సిద్ధమయ్యారు. కాని మరొక్కసారి ఆలోచించారా ! ఆమె భవిష్యత్ గురించి ఒక్కసారి తలవంచి ఆలోచించారా !...లేదు. వెంటనే పెళ్ళికొడుకైపోయారు! నేను మీ మొదటిభార్యకు ఏమన్నా డబ్బు పంపించడం న్యాయమని పోరితేకదూ మీరామెకు డబ్బు పంపుత ! కాని మీ కింత సాహసముందని నేననుకోలేదు. ఆమెను ఈ ఇంటికి వంటమనిషిగా తీసుకు వస్తారా? తాళికట్టిన హక్కుతో ఇలా అవమానిస్తారా?"

"అవమానమా !...తన ఇంటిపనులు తాను చేసుకోవడం తప్పులేదంది సత్యవతి !"

"అవును. ఆమెను గృహిణిగా, మీ భార్యగా మీరు ప్రకటించిననాడు తప్పులేదు. కాని ఆమెను వంటమనిషిగా అందరికీ చెప్పావే !...ఎంత సహించింది సత్యవతి. నేనైతే మిమ్మల్ని చంపి నేను చచ్చేదాన్ని."

"క్షమించు నిర్మలా ! నిన్ను పూర్తిగా అర్థంచేసుకోలేక


SAVE FOR YOUR CHILDREN'S FUTURE
EDUCATION EXPENSES

Join IOB's Unique
"EDUCATION DEPOSIT SCHEME"

You are invited to approach any of
our branches in India
for further details

**INDIAN OVERSEAS BANK**

CENTRAL OFFICE :
MADRAS-2.

పోయాను. సత్యవతిని భార్యగా చెప్పిననాడు, నువ్వు నన్ను వదలి వెళ్ళిపోతావనుకున్నాను."

ఇద్దరిమధ్యా కొన్నిక్షణాలు నిశ్శబ్దం రాజ్యంచేసింది.

సత్యవతి పోయినలోటు మీకు కాదు, నాకు, నా పిల్లలకి. నాకేదన్నా వంట్లో బాగుండకపోతే నాకోసం ఆత్రపడే వారూ, నన్ను అన్నంతినమనీ, హార్లిక్సు తాగమనీ బ్రతిమలాడేవారూ, మందు శ్రద్ధగా వాడమని మందలించేవారూ, ఈ ఇల్లు చక్కబెట్టేవారూ లేరు. మరి సత్యవతిలాటి మనిషి దొరకదు. అందుకే కుమిలి కుమిలి ఏడుస్తున్న నాకు, ఆమె మీ భార్య అని చెప్పారు. ఈ ఇంట్లో మొదటి అన్నం ఆమెది. ఆఖరిసారి ఆమెను చూడలేకపోయాను. గుప్పెడు పసుపు కుంకుమలూ, కొత్తచీరా ఇవ్వాల్సింది. 'సత్యవతి' పోయిందని హాస్పిటల్‌నుంచి ఫోనురాగానే కుప్పకూలిపోయాను. తర్వాత ఏదో నీరసం వచ్చి పదినిమిషాలు తెలివి తప్పిపోయింది. నౌకరు, 'ఏం చెయ్యమన్నారు సత్యవతిని ?' అని అడిగేసరికి ఏడ్చానే కాని మాటరాలేదు. వాడే' 'డబ్బివ్వండి, ఆమె దహన సంస్కారాలు జరిపించేస్తానన్నాడు. రఘుబాబుని బీర్వా తెరచి ఏభై రూపాయలివ్వమన్నాను. సత్యవతిని చూస్తానని అక్కడికి వెళ్తానని రఘు మారాంచేశాడు, అని క్షణం తర్వాత, 'సత్యవతి మనకి సంబంధంలేని మనిషని స్నానమన్నా చెయ్యలేదు. ఇదంతా ఇలా జరిగిందంటే, ఇలా వంటమనిషిగానే ఆమె జీవితం రాలిపోయిందంటే దీనికి బాధ్యులు మీరు'...అని విసురుగా లోపలికి నడిచి ఒక కాయితం పొట్లం తెచ్చి, 'ఇవిగో సత్యవతికి మీరు కట్టిన మంగళసూత్రాలు' అని అతనిముందుకి విసిరింది నిర్మల.

"ఎందుకు నిర్మలా ! నామీద అలా కోపగించుకుంటావు? ఇవెందుకు నాకు? వీటికి నేనేమిటి ప్రాధాన్యమిచ్చాను. ఏం గౌరవమిచ్చాను? ఇప్పుడివి ఏం చేసుకుంటాను?" అన్నాడు విరక్తిగా నవ్వుతూ.

"వీటికి మీరు ప్రాధాన్యమిచ్చి గౌరవించకపోయినా ! వీటితో ఆమెచుట్టూ గిరి గీశారు. బంధించారు. నాశనం చేశారు ఆమె జీవితాన్ని."

అతను మాట్లాడలేదు. విసురుగా పెరటివైపు నడిచాడు. చన్నీళ్ళ స్నానంచేసి బట్టలు వేసుకుని హాస్పిటల్ వైపు నడిచాడు.

*　　　*　　　*

"తర్వాత ఏమైంది, సిస్టర్ ?"

"మిమ్మల్ని చూడాలనీ, మీతో మాట్లాడాలనీ కోరింది. ఇంటికి ఫోన్ చేశాను. మీరు ఇంకా రాలేదని చెప్పారు. ఆ మాట ఆమెకు చెప్పాను. తర్వాత సాయంత్రం, మీ


*With best compliments*

*from*

COATES OF INDIA LIMITED

Printing Inks Manufacturers

MADRAS.

# యువ

పాఠకులకు, ప్రకటనదారులకూ

## దీపావళి శుభాకాంక్షలు

పిల్లల్నీ భార్యనీ ఓసారి పిలవమని బ్రతిమిలాడింది. మళ్ళీ ఫోన్‌చేసాను. ఆమె వుదయం వస్తామని చెప్పమన్నారు..." అంటూ ఆగిపోయింది సిస్టర్.

"తర్వాత...?" అంటూ ఆత్రంగా ప్రశ్నించాడు మూర్తి.

"రాత్రి ఎనిమిది గంటల వేళప్పుడు మళ్ళీ వెళ్లానామె బెడ్ దగ్గరికి. అప్పుడామె నా చెయ్యి పట్టుకుని 'సిస్టర్' మనసివ్వలేని మగాడు కట్టిన ఈ మాంగల్యానికీ, ఈ వివాహబంధానికీ స్త్రీ ఎందుకు తలఒగ్గుతూంది, చెప్పండి సిస్టర్'అని అడిగింది, ఆమె మెడలోని మంగళసూత్రాలు నాకు చూపిస్తూ."

మూర్తి అవాక్కయి సిస్టర్ మాటలు వింటున్నాడు.

"నేను ఆమె ఆవేశం చూసి కంగారుపడ్డాను. 'రెస్టు తీసుకోండి, తర్వాత మాటాడాం' అన్నాను. 'రేపు మరి నా గొంతు ఈ లోకంలో ధ్వనించదు. మనసిచ్చి ఏలుకోని మగాడు కట్టిన ఈ మాంగల్యం నేనెందుకు మొయ్యాలి ? ఈ బంధానికి నేనెందుకు కట్టుబడాలి ? చెప్పండి సిస్టర్...' అంటూ నా చేతులు పట్టుకుని ఏడవడం మొదలుపెట్టింది. నేనామెను ఓదార్చబోయేను. మనసివ్వలేని మగాడు కట్టిన మాంగల్యం స్త్రీ జీవితానికి బలిపీఠం కాదూ—అంటూ వళ్లంతా విరుచుకోవడం మొదలెట్టింది. తర్వాత యమ యాతనపడింది. ఈలోగా తెల్లవారిపోయింది..." అందిసిస్టర్ విషాదంగా శూన్యంలోకి చూస్తూ.

"సరే - వెళ్తాను." అంటూ లేచి వెళ్లిపోయాడు మూర్తి.

*  *  *

'మనసిచ్చి ఏలుకోని మగాడు కట్టిన ఈ మాంగల్యం నేనెందుకు మొయ్యాలి' అందిట. మనిసిచ్చి ఏలుకుంటానని అన్నాడే ! తానెందుకు తిరస్కరించింది?

ఆమెపై తనకు సర్వహక్కులు వుండీ కూడా తానెందుకు దూరంగా వుండిపోయాడు...అతని మనస్సు కకావికలై పోయింది. ఇంటికి వచ్చాక రాధకి వుత్తరం రాశాడు. ఆమె హాస్పిటల్లో వున్న రోజుల్లో తాను ఇంటిదగ్గరలేడనీ, నిర్మలకి అడ్రసు తెలియదనీ, క్షమించమనీ రాశాడు. తర్వాత... 'నాగురించి సత్యవతి నీకిదివరలో చెప్పిందంతా నిజం. నేను సత్యవతిని కావాలని మనసారా కోరుకున్నాను. ఆమెను బతిమిలాడేను...ఆమె నాకు దగ్గరకావాలని ఎదురుచూశాను. కాని విధి నన్ను వెక్కిరించింది. నా కోరిక తీరకుండానే సత్యవతి వెళ్లిపోయింది...'అని రాసి వుత్తరం పోస్టు చేశాడు.

*  *  *

కళ్లలో కదిలిన కన్నీటి తెరలు ఎదురుగుండా వున్న దృశ్యాల్ని మసకబారేట్లు చేశాయి.

కళ్ల తుడుచుకుని బరువుగా ఇంటివేపు అడుగువేశాడు.

Printed and Published by A. Sudhakara Rao, at 5-9-88, Public Garden Road, Hyderabad. for YUVA Publications and Printed at Dolton Press, Hyderabad-500001.
Controlling Editor : "CHAKRAPANI"